నేడు ఎంపీ పురందేశ్వరి రాక

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం రాజమహేంద్రవరం విచ్చేయనున్నారు. న్యూఢిల్లీలోని లోక్‌సభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం రాజమహేంద్రవరం వస్తున్నారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.



పోలీస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ జగదీశ్

అదృశ్యం కేసులపై దృష్టి

- ప్రతి స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయండి
- జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జగదీశ్ ఆదేశం

రాజమహేంద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యం(మిస్సింగ్) కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. 'ఏమైపోతున్నారు వీళ్లు' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 8 ఏళ్లలో 560 మంది బాలలు, బాలికలు, మహిళలు, పురుషులు జాడ లేకపోవడంపై కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీంతో ఎస్పీ జగదీశ్ జూమ్ కాన్ఫరెన్స్ విధానంలో అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల పరిస్థితిపై ఆరా తీశారు. త్వరితగతిన పెండింగ్ కేసుల పరిష్కరించే కార్యాచరణపై చర్చించారు. మిస్సింగ్ కేసులపై సరైన రీతిలో వేగంగా స్పందించాలని, దర్యాప్తులో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో కారణాలను గుర్తించడంలో చొరవ చూపాలన్నారు. బాధితులు లేదా బాధిత తల్లిదండ్రులు స్టేషన్‌కి వచ్చిన సందర్భంలో వారికి ధైర్యం చెప్పి సముదాయించాలన్నారు. స్నేహపూర్వకంగా వారితో మాట్లాడి సాధ్యమైనంత ఎక్కువ సమాచారాన్ని రాబట్టాలన్నారు. ఆధునిక సాంకేతికత సహాయంతో తక్షణమే రంగంలోకి దిగాలని చెప్పారు. ఏ మాత్రం పోలీసుల అలసత్వం ఉందని రుజువైతే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మిస్సింగ్ కేసులకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. ఈ విషయంలో ప్రజలు కూడా తమ వంతు సహాయ సహకారాలను పోలీసులకు అందించాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే దగ్గరలోని పోలీసులకు లేదా డయల్ 112కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అవసరమైతే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.



జీజీహెచ్‌లో జలగలపై చర్యలేవి?

ప్రక్షాళన చేస్తామని వదిలేసిన సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ఎంఎన్‌ఓలు రోగులను జలగల్లా పీడిస్తున్నారని, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి వాటికి వేలకు వేలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తినా అవినీతిపరులపై చర్యలు తీసుకోవడానికి వైద్యాధికారులు వెనుకాడుతున్నారు. అవినీతికి కేరాఫ్‌గా ఉన్న అసలు మూలాలను వదిలేసి చిరుద్యోగులపై ప్రతాపం చూపుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో జలగలు పేరుతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన వార్త నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ వివరణ ఇస్తూ నలుగురు ఎంఎన్‌వోలను విధుల నుంచి మార్చడం జరిగిందని తెలిపారు. ఎంఎన్‌వో విభాగాన్ని ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్‌వైజర్ విషయంలో సూపరింటెండెంట్ ఆచితూచి స్పందించడం గమనార్హం. ఎంఎన్‌వోలను ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు మార్చేశామని చెబుతూ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేస్తుండడం ఆసుపత్రి చిరుద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ఎంఎన్‌వోలకు డ్యూటీ రోస్టర్ వేసే సమయంలోనే భారీగా అవకతవకలు జరుగుతున్నాయంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వస్తుండగా, డ్యూటీ రోస్టర్ సిద్ధం చేస్తున్న ఎంఎన్‌వో స్థాయి ఉద్యోగిని పక్కకు తప్పించకుండా తూతూ మంత్రంగా ఇతర ఎంఎన్‌వోలను మార్చేయడం వల్ల అంటుకున్న అవినీతి మరక ఎలా పోతుందనే భావన చాలా మంది ఎంఎన్‌వోల్లో వ్యక్తమవుతోంది. ఆసుపత్రి పరువు రోడ్డున పడుతున్నా పట్టించుకోకుండా ఒక్క ఎంఎన్‌వో కోసం జీజీహెచ్ అధికారులు తమను బలిపశువులను చేస్తున్నారనే అభిప్రాయం చిరుద్యోగుల్లో ఉంది.

36 మందిలో.. ముగ్గురికే అందలం

- అప్కాస్ సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా మాత్రమే
- కమిషనర్ దినేష్‌కుమార్ స్పష్టీకరణ
- 33 మంది భవిష్యత్ అయోమయం

రాజమహేంద్రవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అప్కాస్ సిబ్బందిలో ఎవరైనా విధులు నిర్వహిస్తూ మరణిస్తే వారికి ఎక్స్‌గ్రేషియా మాత్రమే చెల్లించడం జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ దినేశ్ కుమార్ స్పష్టం చేశారు. 33 మంది డ్రైవర్లు, కారుణ్య నియామకాల విషయంలో జరుగుతున్న అన్యాయంపై 'కమిషనర్ సారూ.. ఇదేం తీరు' అనే శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై కమిషనర్ శుక్రవారం స్పందించారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ వద్ద కారుణ్య నియామకాలకు సంబంధించి రెండు దరఖాస్తులు మాత్రమే ఉన్నాయన్నారు. తడిచెత్త-పొడిచెత్త వాహనాలపై పనిచేయడానికి కాంట్రాక్టరుచే సరఫరా చేయబడిన 36 మంది డ్రైవర్లలో అధికారుల వద్ద క్రమశిక్షణతో పని చేస్తూ, మంచి నైపుణ్యం కలిగిన ముగ్గురు డ్రైవర్లను వారి అభ్యర్థన మేరకు కలెక్టర్ ఆదేశాలతో అప్కాస్ పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నామన్నారు. మిగతా 33 మంది డ్రైవర్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 36 మంది డ్రైవర్లలో ముగ్గురిని అధికారుల వద్ద పనిచేయడమే అర్హతగా పరిగణించి అందలం ఎక్కించడానికి సిద్ధమైనట్లు 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది. మరి మిగతా 33 మంది పని తీరుకు కొలమానం ఏమిటనేది ప్రశ్నగానే ఉంది.

జి.యర్రంపాలెంలో డ్వాక్రా మహిళల ఆందోళన 7

భూ.. మంతర్!



రూ.80 కోట్ల విలువైన భూమి హాంఫట్

- వైసీపీ నేతల భూదాహం
- అధికారుల మాయాజాలం
- 23.33 ఎకరాల భూబాగోతం
- భూమి విలువ రూ.80 కోట్లు
- సర్వే నెం 21/13ఎన్‌లో అక్రమాలు
- ఏ1 రిజిస్టర్ లేని వారి పేరన హక్కు
- రూరల్ తహశీల్దార్ ఆఫీస్‌లో తీరు
- వారసులను మార్చేసిన వైనం
- రికార్డుల్లో చూపిన అధికారులు
- చేతులు మారిన కోట్లు

సాధారణంగా ఎవరికైనా ఆస్తి వారి పూర్వీకుల నుంచి సంక్రమిస్తే వారసత్వ హక్కుతో వారసులకు అనువంశికంగా వస్తుంది.. కొనుగోలు చేస్తే ఇతరుల నుంచి సంక్రమిస్తుంది. కొన్ని సందర్భాల్లో వీలునామా, దానపట్టా ద్వారా కూడా కుటుంబీకులకు ఒకరి నుంచి మరొకరికి దాఖలు పడుతుంది. రాజమహేంద్రవరంలో అలాకాదు.. ఎక్కడైనా సరే ఖాళీ భూమి చూస్కోండి.. ఎటువంటి వారసత్వం లేకపోయినా ముడుపులు తీసుకొని ఆ భూమిని మన పేరున మార్చేస్తారు.. ఈ తంతు అంతటికీ కొంత మొత్తం ఖర్చవుతుందంతే.. దీనిపై వివరాలు కావాలంటే మాత్రం రాజమహేంద్రవరం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయం అధికారులను సంప్రదించాల్సిందే మరి.. ఎందుకంటే ఇప్పటికే సుమారు రూ.80 కోట్ల విలువైన 23.33 ఎకరాల ఆస్తికి రికార్డులు మార్చి వేరొకరికి అను వంశికంగా చెందినట్టు చేసిన ఘనులున్నారు..


రాజమహేంద్రవరం రూరల్, జూలై 5 : డబ్బుతో కానిది ఏమైనా ఉంటుందా..అధికారులు తలచుకుంటే ఎందుకు కాదు.. రాత్రికి రాత్రి ఒకరిని భూస్వామిని చేసేస్తారు.. వారసులు లేని భూమికి యజమానిని చేసేస్తారు..పైసలు తీసుకుని పత్రాలే మార్చేస్తున్నారు. రెవెన్యూ డిపార్టుమెంటులోని కొందరు అధికారులు ల్యాండ్ రికార్డులు మార్పులు చేసి లేని వారి పేర్లను సృష్టిస్తారు.రాజమండ్రి రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో అదే చేశారు.

భూమికి వారసుడిని సృష్టించారు..

భూదాన ఉద్యమంలో భాగంగా 21/13 సర్వే నెంబరులో భూమిని అప్పారావు అనే అతనికి 1970 ప్రాంతంలో కేటాయించారు.పెద్దాపురం రెవెన్యూ పరిధిలో ఉండగా కేటాయింపులు జరిగాయి.ఈ భూమికి సరిహద్దుగా ఒక లేఅవుట్ వచ్చింది.ఆ సమయంలో ఈ భూమి ఎవరి ఆధీనంలో లేదని బయటకు పొక్కింది.ఈ విషయం ఆ నోటా ఈ నోటా వైసీపీ నాయకులకు తెలిసింది. అది కారంలో ఉండడం.. జిల్లాల విభజన జరడంతో 2020వ సంవత్సరంలో వారసుడు లేని భూమికి వారసుడిని సృష్టించారు. ఈ మార్పిడి వ్యవహారంలో గ్రామ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు కోట్లలో చేతులు మారినట్టు కొంతమంది రెవెన్యూ అధికారులే చెప్పడం విశేషం. ఇదిలా ఉండగా ఇటీవల భూమిని సబ్ డివిజన్ చేసుకోవడానికి దరఖాస్తు చేయడంతో విషయం వెలుగుచూసింది. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున చేతులు మారినట్టు సమాచారం. ఈ భూమి అప్పారావు అనే హిందువుకి చెందినదిగా పూర్వపు అడంగల్‌లో నమోదై ఉంది. అయితే ఒక ముస్లింకి అను వంశికంగా వచ్చినట్టు రెవెన్యూ రికార్డుల్లో చూపారు. ఇదెలా సాధ్యమైందనేది అధికారులకెరుక..

23.33 ఎకరాల భూమి

రాజమహేంద్రవరం రూరల్ మండలం మోరంపూడి పరిధిలో సర్వే నంబరు 21-13ఎన్ సుమారు 23.33 ఎకరాలు భూమికి మీర్ ఇనామత్ ఆలీ పేరున రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేశారు. అడంగల్‌లో కూడా అనువంశికం ద్వారా సంక్రమించిన ఆస్తిగా నమోదు చేశారు. అయితే ఏ-1 రిజిస్టరులో ఇతని పేరుగాని, తండ్రిపేరుగాని దఖలు పడలేదు. రెవెన్యూ అధికారులు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలంటే తమ పూర్వీకుల పేరుతో సరిపడా వారసత్వాన్ని నిరూపిస్తూ అన్ని డాక్యుమెంట్లను సమర్పించాలి. వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించిన మీదట మాత్రమే తమ పేరున నమోదు చేస్తారు.అసలు మీర్ ఇనామత్ ఆలీకి సంబంధించి ఎలాంటి పత్రాలు ఏ-1 రిజిస్టరులో లేనపుడు ఆయన పేరున భూ యాజమాన్య హక్కు పత్రాలు ఎలా మంజూరు చేశారనేది అర్థంకాని ప్రశ్నగా ఉంది. సామాన్య రైతు కష్టపడి ఎకరమో.. అర ఎకరమో కొనుక్కుంటే వాటిని మ్యుటేషన్ చేయాలంటూ రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే సవాలక్ష ప్రశ్నలు అడుగుతారు. చెప్పులు అరిగేలా తిప్పించుకుంటారు. సుమారు రూ. 80 కోట్ల విలువ గలిగిన 23.33 ఎకరాల భూమిని మీర్ఇనామత్ఆలీ పేరుతో రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



1970లో బుర్రి అప్పారావు పేరున ఉన్న రికార్డు



రికార్డులో చేరిన మీరా ఇనామత్ అలీ పేరు

చక్రం తిప్పిన వైసీపీ నాయకులు

గతంలో మాజీ వైసీపీ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసిన ముస్లిం సామాజికవర్గానికి చెందిన వ్యక్తి చక్రంతిప్పాడనే ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో రూరల్ తహశీల్దార్ రియాజ్ హుస్సేన్ కీలకంగా వ్యవహరించి ఏ-1 రిజిస్టరులో లేకపోయినప్పటికి తప్పుడు రికార్డులు సృష్టించి అవినీతికి పాల్పడ్డారని పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారమంతా గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది.

సబ్ డివిజన్‌కు ప్రయత్నాలు

ఎప్పుడైనా ఒక ఆస్తి రెండు మూడు చేతులు మారితే ఎవరికి ఎలాంటి అనుమానం ఉండదని భూములను చేతులు మార్చుతుంటారు. ఈ నేపథ్యంలోనే సదరు భూమిని తమ కుటుంబీకుల పేరున వాటాలుగా సబ్ డివిజన్ చేయాలంటూ వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు దరఖాస్తు చేసుకున్నారు. సబ్ డివిజన్ చేసేందుకు రెవెన్యూ అధికారులతో బేరం కుదుర్చుకున్నట్టు సమాచారం. ఈ భూములకు సంబంధించి అసలు వారసులు ఉన్నట్టుగా తెలిసింది. అయితే వారిని గత ప్రభుత్వం నయానోభయానో ఇబ్బందులు పెట్టడంతో వారు ఏమి చేయలేని స్థితిలో ఉన్నట్టుగా సమాచారం. ఏది ఏమైనా 23.33 ఎకరాల భూమి దారుణంగా రికార్డులు మార్చి వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అనుచరుడుతో దోచేయడం దానికి అధికారులు సహకరించడం మూకుమ్మడిగా కోట్లాది రూపాయలు చేతులు మారినట్టుగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇదే విధంగా రూరల్ నియోజకవర్గంలో ధవళేశ్వరం, పిడింగొయ్యి, మోరంపూడి ప్రాంతాల్లో బయటకు రాని భూ కుంభకోణాలు అనేకం ఉన్నాయి.గత ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపడంతో ఒక్కొక్కటిగా అక్రమాలు బయటకు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా కలెక్టర్ మారడంతో ఇటువంటి భూరికార్డులు మార్పిడిపై దృష్టి పెట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేసి రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తారా, లేక విడిచిపెడతారో వేచి చూడాలి.

సెబ్.. చేసిందేటబ్బా!



పనిచేయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్

- అంతంతమాత్రమే పనితీరు
- సారా నియంత్రించలేదు..
- ఇసుక దోపిడీ అరికట్టలేదు..
- బెల్ట్ తీసిన దాఖలాలు లేవు..
- ఎక్సయిజ్ శాఖ నిర్వీర్యం
- సెబ్ తెచ్చిన వైసీపీ
- ఆ పార్టీకి అండగా తీరు
- మామూళ్ల మత్తు
- సారా బట్టీకింతని డిమాండ్
- కూటమి ఏం చేస్తుందో మరి

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్).. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అంటే ఈ డిపార్ట్‌మెంట్ గురించే చెప్పుకోవచ్చు. ఎందుకంటే వైసీపీ వచ్చిన తరువాత ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ స్థానంలో సెబ్ వచ్చింది.. ఇదీ చేసిందీ లేదు.. వెలగబెట్టిందీ లేదు.. సెబ్ అధికారులు మామూళ్ల మత్తులో సారా నియంత్రించడమే మానేశారు.. దీంతో పల్లెపల్లెనా సారా బట్టీలు.. బెల్ట్ షాపులు పెరిగిపోయాయి.. నాడు చంద్రబాబు హయాంలో బెల్ట్ తీశారు.. సారాను నియంత్రించారు.. సెబ్ అధికా రుల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ ఇప్పుడు సారా ఏరులైపారుతోంది.. ఇక బెల్ట్‌షాపులైతే వీధికొకటి చొప్పున ఉన్నాయి.. మళ్లీ ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో అధికారులు బెల్ట్ తీయాలి.. సారా జోరు అరికట్టాలి.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో. షార్ట్ కట్‌లో సెబ్ అంటారు. 2020లో వైసీపీ ప్రభుత్వం తెర మీదకు తెచ్చింది. ఈ డిపార్ట్‌మెంట్‌కు రెండు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. మందుబాబులను నియంత్రించడం,వినియోగం తగ్గించడం, అక్రమ మద్యం అమ్మకాలు లేకుండా చూడడంతో పాటు సారా లేకుండా చేయడం.. అంతే కాకుండా ఇసుక అక్రమాలు జరగకుండా చూడడం మరొక లక్ష్యం. ఈ డిపార్ట్‌మెంట్‌కు కేసులు పెట్టే అధికారం, అక్రమ ఇసుక, లిక్కర్, సారా స్వాధీనం చేసుకునే అధికారం ఉంది. ఈ మేరకు జిల్లాకు ఒక ఏఎస్పీ స్థాయి అధికారిని, మరో ఏడుగురు అధికారులు, స్టాఫ్‌తో డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసింది. సెబ్ వల్ల ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పాత జిల్లాలో డివిజన్‌లో ఎక్సయిజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ సూపరిం టెండెంట్, సీఐలు పెద్ద ఎత్తున స్టాఫ్ ఉండేవారు. రాజమహేంద్రవరం వై.జంక్షన్ వద్ద ఎక్సయిజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఉండేది. దీంతో నాడు కాస్తయినా భయం ఉండేది.. సెబ్ వచ్చిన తరువాత అసలు భయమే లేకుండా పోయింది.

వైసీపీ పాపాలకు కేరాఫ్ సెబ్

ఈ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వెనుక వైసీపీ పెద్ద కుట్ర పూరితంగా వ్యవహరించినట్టు ఇపుడిప్పుడే అందరికీ అర్థమవుతోంది. గతంలో లిక్కర్, సారా, గంజాయి, డ్రగ్స్ వంటివి అరికట్టే బాధ్యత ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిపార్ట్‌మెంట్‌కు ఉండేది. ఇసుక కుంభకోణాలు అరికట్టడం, వాటిపై విచారణలు చేయడం వంటివి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ చూసేది. ఇంకా రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు పట్టించుకునేవారు.స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) తెరమీదకు రావడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ పట్టించుకోవడం మానేసింది. ఈ డిపార్ట్‌మెంట్‌ను అడ్డుపెట్టుకుని వైసీపీ ఇసుక, లిక్కర్ అక్రమాలకు పాల్పడింది. మద్యం అవుట్ లెట్లను ప్రభుత్వమే ఏర్పాటు చేసి నాణ్యమైన బ్రాండ్లను రద్దు చేసింది. నాసిరకం బ్రాండ్లతో కేవలం నగదు లావాదేవీలతో అమ్మకాలు సాగించి వైసీపీ విపరీతంగా దోచుకుంది. ఇంత జరుగుతున్నా జిల్లాలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కన్నెత్తి చూడలేదు. ధవళేశ్వరంలో నకిలీ మద్యం అమ్మకాలు బయటపడ్డ తర్వాత కూడా కఠినంగా వ్యవహరించిన దాఖలాలు లేవు.

ఏరులైపారిన సారా

రాజమహేంద్రవరంసిటీ,రూరల్, రాజానగరం, కోరుకొండ, కడియం, చాగల్లు మండలాల్లో సారా తయారీ పెరిగిపోయింది. శ్రీరామపురం, పిడింగొయ్యి, నామవరం వంటి ప్రాంతాల్లో సారా ఎక్కువగా కాస్తున్నారు. అంతేకాదు గతంలో పెద్ద గోతులు తవ్వి, మంటవేసి బెల్లం ఊటతో కాసేవారు.ఇటీవల బ్యాటరీ పొయ్యిలు వచ్చాయని చెబుతున్నారు. వీటితో సారా కాస్తే పొగ కనిపించదు. ప్యాకెట్లు, బాటిళ్లలో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఇవేవీ సెబ్ కళ్లకు కనబడవు. ఇతర ప్రాంతాల నుంచి ఒకటో రెండో బాటిల్స్ తెచ్చుకునేవారిని తప్ప మద్యం అక్రమాలపై పెద్దగా కేసులు నమోదు చేసినవి తక్కువే. అదే సమయంలో సారా మీద మొదట్లో బయపెట్టేటట్టు ప్రచారం చేసింది. కానీ అరికట్టలేదు. అప్పట్లో ఒక సీఐ స్థాయి అధికారి ఏడాది ఒక్కో నాటు సారా బట్టీ నుంచి రూ.లక్ష, ఎస్ఐ రూ.50 వేలు, తర్వాత అధికారులు ,సిబ్బంది తమకు అంకిన కాడకు మామూళ్లు తీసుకుని వదిలేసేవారు.

ఇసుకను వదిలేశారు..

ఇసుక అక్రమాలు జిల్లాలో పెద్దఎత్తున జరిగిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జేపీ సంస్థకు ఇసుక కాంట్రాక్టు ఇచ్చినా ఆ సంస్థ ఎంత తవ్విందో, ఎంత మేర తవ్విందో, సరిహద్దులు ధిక్కరించిందా, ఎంత సొమ్ము వచ్చిందనేది పట్టించుకోలేదు.గత మే నెల తర్వాత కాంట్రాక్టు సంస్థ గడువు ముగియడంతో పాత జేపీ సంస్థ బిల్లులతో ఇసుక రవాణా జరిగింది. అక్రమ డ్రెడ్జింగ్ జరిగింది. బ్రిడ్జిల సమీపంలో ప్రమాదకరంగా పెద్ద గోతులు పెట్టి తవ్వినా, అక్రమ ఇసుక గుట్టలుగా ఉన్నా, పట్టపగలే డ్రెడ్జింగ్ పడవలు కంటికి కనిపించినా సెబ్ అధి కారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అప్పటి అక్రమాలన్నీ బయటకు వస్తు న్నాయి.ఈ నేపథ్యంలో సెబ్ డిపార్ట్‌మెంట్‌ను ప్రక్షాళన చేసే దిశలో ప్రభుత్వ ఆలోచనలు ఉన్నట్టు సమాచారం.





సీతానగరంలో కాలినడకన వెళుతూ అపారిశుధ్యం పరిశీలిస్తున్న కలెక్టర్ ... పీహెచ్‌సీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఒక్క డయేరియా కేసు పెరిగినా అధికారులపై చర్యలు

సీతానగరంలో అధికారులకు కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

సీతానగరం,జూలై 5 : సీతానగరం మండలంలో మరొక్క డయేరియా కేసు పెరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను హెచ్చరించారు. సీతానగరం గ్రామంలో 11 డయేరియా కేసులు నమోదు కావడంతో శుక్రవారం ఆమె పర్యటించారు. ముందుగా సీతానగరం పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. డయేరియా కేసులు పెరగకుండా ఏం చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. సీతానగరం పీహెచ్‌సీ దుస్థితిని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భార్య బత్తుల వెంకటలక్ష్మి కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు గ్రామంలో పారిశుధ్యం పరిశీలిస్తూ కాలినడకన పంచాయతీ నుంచి పీహెచ్‌సీ సెంటర్‌కు వెళ్లారు. మార్గమధ్యలో నీళ్ల నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీని చూసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను పరామర్శించారు. డయేరియా కేసుల నియంత్రణపై అధికారులకు సూచనలు చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతానగరం పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరిందని.. మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బొబ్బిల్లంక వద్ద పీహెచ్‌సీ సెంటర్ మంజూరైందని.. దీనికి నిధులు కేటాయించే ప్రయత్నం చేద్దామన్నారు. స్థానికులు ఎవరైనా రోడ్డుపై చెత్తవేస్తే నోటీసులు ఇచ్చి వారిపై చర్యలు తీసుకోవాలని డీపీవో రాంబాబు పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిత్యం పంచాయతీ పరిశుభ్రం చేస్తున్నా మళ్లీ చెత్త రోడ్డుపక్కనే వేస్తున్నారని పంచాయతీ అధికారులు తెలిపారు. చెత్తబుట్టలు పెట్టుకుని చెత్తను దాంట్లో వేసుకుని పంచాయతీ వాహనం వచ్చినప్పుడు దాంట్లో వేసేలా అలవాటు చేయాలన్నారు. ఆర్డీవో చైత్రవర్షిణి, డీఎల్‌డీవో వీణాదేవి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, బత్తుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం!

జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం



కరప, జూలై 5: విశాఖ జిల్లా భీమిలిలో గత నెల పెంపుడు కుక్క కరిచి 27ఏళ్ల భార్గవ్ మృతి చెందాడు. పెట్ డాగ్ కరవడంతో అతనికి రేబిస్ వ్యాధి సోకి చిన్నవయసులోనే చనిపోయాడు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక నాలుగు రోజుల వ్యవధిలో అతని తండ్రి కూడా తనువు చాలించాడు. ఆ ఇంట్లో ఇంతటి విషాదానికి కారణం ఒక పెంపుడు కుక్క. రేబిస్ వ్యాధితో అది చనిపోవడం.. అప్పటివరకు భార్గవ్ మేల్కోకపోవడం వల్ల ఆ కుటుంబానికి తీరని వేదన మిగిలింది. పెంపుడు జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల సరైన అవగాహన లేకపోవడం, వాటి పెంపకంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, సకాలంలో వ్యాక్సిన్లు వేయించకపోవడం తదితర కారణాల వల్ల సమాజంలో ఇటువంటి దారుణ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 200లకు పైగా జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తున్నట్టుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శనశాలల సిబ్బంది, పరిశోధనశాలల్లో పనిచేసే సిబ్బందికి ఈ జూనోటిక్ వ్యాధులు ఎక్కువగా సోకుతున్నాయి. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారి 1885 జూలై 6వ తేదీన పిచ్చికుక్క కాటుకి గురైన ఒక వ్యక్తి ప్రాణాలను యాంటీ రేబిస్ టీకాతో కాపాడిన సందర్భంగా ఏటా ఈరోజును జూనోసిస్ డేగా నిర్వహిస్తున్నారు. జూనోటిక్ వ్యాధులను వైరస్, బ్యాక్టీరియల్, ప్యారసైటిక్ వ్యాధులుగా విభజించవచ్చు. వైరస్ వల్ల సంక్రమించే వ్యాధులలో రేబిస్, మెదడువాపు, బర్డ్ ఫ్లూ వంటివి ముఖ్యమైనవి. బ్యాక్టీరియా వల్ల బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోస్పైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం వంటి వ్యాధులు సోకుతాయి. పరాన్న జీవుల వల్ల సంక్రమించే ప్యారసైటిక్ వ్యాధుల్లో బద్దె పురుగులు, ఏలికపాములు, ఫైలేరియా, హైడాటిడ్ వంటివి ప్రముఖంగా చెప్పుకోవచ్చు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకుని అప్రమత్తతతో వ్యవహరిస్తే వాటి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

యజమానులు అప్రమత్తంగా ఉండాలి..

పెంపుడు జంతువుల యజమానులు వాటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్రమత్తంగా ఉంటూ వాటి ప్రవర్తనలో తేడాలను గమనించాలి. రేబిస్ నివారణకు సకాలంలో టీకాలను వేయించాలి. అలాగే పశువైద్యుడు సూచించిన షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్లు ఇప్పించాలి. వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూసుకోవాలి. పెంపుడు జంతువుల్లో అసాధారణ ప్రవర్తనలను గమనిస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి.

పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

పాడిరైతులు తమ పశువులను సాకే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాదరక్షలు, రక్షిత దుస్తులు ఉపయోగించాలి. పశువుల శాలలు, పాలు పితికే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచాలి. పశువులకు క్రమంతప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. అనారోగ్యంతో ఉన్నవాటిని మంద నుంచి తప్పించాలి. జూనోటిక్ వ్యాధుల వ్యాప్తి, నివారణా చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలి.

సంపూర్ణ అవగాహనతో వ్యాధులు దూరం

సంపూర్ణ అవగాహనతో జూనోటిక్ వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. ఈ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. జంతు ఉత్పత్తులను పూర్తిగా వండడం, సురక్షితమైన ఆహార నిర్వహణ, సరైన రీతిలో నిల్వచేయడంపై దృష్టిసారించాలి. వ్యాధులను వ్యాప్తిచేసే కీటకాలు, ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. రేబిస్ లక్షణాలు ఉన్న పెంపుడు జంతువు కరిస్తేనే కాకుండా వాటి చొంగ వల్ల సులభంగా రేబిస్ సోకుతుంది. పిచ్చికుక్కలు మనుషుల ముఖం మీద, పశువుల ముట్టి మీద కరిస్తే ప్రాణాపాయం తలెత్తకుండా వెంటనే ఇమ్యూనోగ్లోబ్యులిన్స్ అనే టీకాను వేయించుకోవాలి.

సంక్రమణ వ్యాధుల నివారణకు చర్యలు



సంక్రమణ వ్యాధుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. జూనోసిస్ డే సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో 1,500 డోసుల రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను సిద్ధంచేశాం. రేబిస్‌కు చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలను సమీప పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల వద్దకు తీసుకువచ్చి ఈ టీకా ఇప్పించాలి.

- డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు, పశుసంవర్థకశాఖ ఏడీ, కరప ప్రాంతీయ పశువైద్యశాల

వెల్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- డీఎస్పీ పరిశీలన, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం తనిఖీలు
- దోషులను కఠినంగా శిక్షించాలి : దళిత నాయకులు



ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ద్రాక్షారామ, జూలై 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద రోడ్డుపక్కన 9 ఏళ్ల కిందట సిమెంటు దిమ్మపై బాబూజగజ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి కిందపడేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సచివాలయ సిబ్బంది విగ్రహం ధ్వంసంకావడం చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ఎస్ఐ సురేంద్రబాబు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌ను రప్పించారు. క్లూస్‌టీం సభ్యులు వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ద్రాక్షారామ ఎస్ఐ సురేంద్రబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో అశాంతి, అలజడి సృష్టించేందుకు అసాంఘిక శక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. సమాచారం తెలిసిన వెంటనే క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా సమాచారం తెలిసిన వెంటనే నియోజకవర్గానికి చెందిన దళిత, ప్రజా సంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసంచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎంపీపీ అంబ టి భవానీ, జనసేన నాయకుడు బుంగరాజు, టీడీపీ నాయకుడు రవ్వాభూషణం, వైసీపీ నాయకులు అంబటి తుకారాం, పోలినాటి ప్రసాద్, రైతుకూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ డిమాండు చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ బి.రామకృష్ణ

అస్వస్థతకు గురైన వేద పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శ



వేద విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, జూలై5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థులు డయేరియా బారినపడడంతో స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌తో కలసి పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అస్వస్థతకు గురైన వారు కోలుకుంటున్న శివసదన్ కాటేజీలో మరింత మెరుగైన వైద్యం అందిస్తున్నారు. 17 మంది విద్యార్థులను వారంరోజులపాటు తమ ఇంటికి విద్యార్థుల తల్లిదండ్రులతో పంపించారు. పూర్తిగా కోలుకున్న తరువాత మిగిలిన వారిని పంపడం జరుగుతుందని అన్నారు. వేద పాఠశాల ఆవరణ, వాటర్‌ట్యాంక్‌లను పరిశుభ్రం చేస్తున్నారు. విద్యార్థులకు ఎమ్మెల్యే పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు వెన్నా శివ, పర్వత సురేష్, బద్ది రామారావు తదితరులు పాల్గొన్నారు.

లీటరు డీజిల్ రూ.80కే

- ఓ రైతుకు 200 లీటర్లు పోయించిన దుండగుడు
- బంకు సిబ్బందిని నమ్మబలికి ఆపై సొమ్ములతో పరారీ
- నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో ఘటన



మోసానికి పాల్పడిన కేటుగాడు ఇతడే

నల్లజర్ల, జూలై 5: కేటుగాళ్లు పెట్రోల్ బంకులను టార్గెట్ చేస్తున్నారు. మొన్న నల్లజర్ల పెట్రోల్ బంకు వద్దకు కారులో వచ్చి రూ.19 వేల డీజిల్ కొట్టించుకుని నకిలీ ఏటీఎం ఇచ్చి పరారైన సంఘటన మరువక ముందే గురువారం మరో ఘటన వెలుగు చూసింది. దమ్ముల సీజన్‌కావడంతో అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రైతు కోడూరి భారత్ ట్రాక్టర్‌తోపాటు టిన్స్‌లో డీజిల్ కొట్టించుకోవడానికి బంకు వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తనకు జేసీబీ ఉందని, దానికి బిల్లు పెట్టుకోవడానికి లీటరు రూ.97 ఉన్న డీజిల్ రూ.80కే కొట్టిస్తా డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో భరత్ 200 లీటర్లు కొట్టించుకుని సదరు వ్యక్తికి రూ.16 వేలు ఇచ్చి వెళ్లిపోయాడు. బంకు సిబ్బందికి, తాను డబ్బులు మొత్తం ఇస్తానని, మరో రెండు టిన్‌లు ఉన్నాయని, వాటిలో కూడా నింపాలని ఆ వ్యక్తి బైక్‌పై పరారయ్యాడు. సదరు బంకు సిబ్బంది శుక్రవారం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి రాజధాని నిర్మాణానికి కవల విద్యార్థినుల విరాళం

దాచుకున్న రూ.9999 సొమ్మును ఎమ్మెల్యేకు అందజేత



రాజధాని నిర్మాణానికి చిన్నారులు దాచుకున్న సొమ్మును ఎమ్మెల్యేకు అందిస్తున్న దృశ్యం

అంబాజీపేట, జూలై 5: తాము దాచుకున్న సొమ్మును కవల విద్యార్థినులు ఏపీ రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి విరాళంగా అందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటిపాలానికి చెందిన యర్రంశెట్టి చిత్రహర్షిణి, చిత్రవర్షిణి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. తండ్రి నాగబాబు ఇచ్చిన డబ్బులను దాచుకున్న ఆ విద్యార్థినులు మొత్తం రూ.9,999ను స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు రాజధాని నిమిత్తం అందించారు. చిన్నారుల తాతయ్య యర్రంశెట్టి పాండురంగారావు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆదేస్ఫూర్తితో ఆయన మనమరాళ్లు విరాళం ఇవ్వడంపై పలువురు వారి దాతృత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.సరోవర్, తహశీల్దారు విమలకుమారి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కె.సాయిరాం పాల్గొన్నారు.

8న రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 : రాజమహేంద్రవరంలో ఈనెల 8వ తేదీన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి ప్రధాన అజెండాగా సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాల్గొంటారన్నారు. మాజీ సీఎం జగన్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

8న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా-2024

కార్పొరేషన్(కాకినాడ), జూలై 5: కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ గవర్నమెంట్ ఐటీఐలో ఈనెల 8న ఉదయం 9గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా-2024 నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ జీవీఎం వర్మ తెలిపారు. జిల్లాలో ప్రముఖ పరిశ్రమలనుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రంటీస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తారనన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో వివిధ ట్రేడ్లలో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్సీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్, సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలన్నారు.

8న జాబ్‌మేళా

కలెక్టరేట్(కాకినాడ), జూలై 5: ఈనెల 8న సోమవారం వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన శుక్రవారం విడుదల చేశారు. పట్టాబి ఆగ్రో ఫుడ్స్, శ్రీకాళేశ్వరి రిఫైనరీ అండ్ ఇండస్ట్రీ, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్ అండ్ హోండాయ్ మోబీస్ కంపెనీ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 8న సోమవారం వికాస కార్యాలయం కాకినాడ కలెక్టరేట్‌వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376111 నెంబరును సంప్రదించాలన్నారు.

అంతర్వేది హుండీల ఆదాయం రూ.46.11 లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

అంతర్వేది, జూలై 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.44,47,752, గుర్రాలక్కమ్మ అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.26,572, అన్నదాన హుండీ ద్వారా రూ.1,09,888, మొత్తం 101 రోజులకుగాను హుండీల ద్వారా రూ.46,11,212 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.19,452 వచ్చిందన్నారు. దేవదాయశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సూపరింటెండెంట్ విజయసారథి, ఈవో బొక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లోవలో హుండీల ఆదాయం రూ.35 లక్షలు



ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

తునిరూరల్, జూలై5: లోవ దేవస్థానంలో అధికారులు హుండీలు లెక్కించారు. రూ.35,46,802 నగదు, 0.87 మిల్లీ గ్రాముల బంగారం, 3.200 కిలోల వెండి వచ్చినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొనగా జగన్నాథపురం గ్రూప్ టెంపుల్స్ అధికారి వడ్డారి సత్యనారాయణ, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ అధికారి సూర్యామణి లెక్కింపులో ప్రత్యేకాధికారులుగా పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రెండు లక్షల విరాళం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూలై 5: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కాకినాడకు చెందిన అన్యం రాములు, సావిత్రమ్మ దంపతులు 1,00,116, కట్టిరెడ్డి లక్ష్మణరావు, నాగరత్నం దంపతులు పేరున 1,00,116 విరాళంగా సమర్పించారు. దాతలు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా, వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

మతిస్థిమితం లేని మహిళపై కత్తితో దాడి : నిందితుడికి రిమాండ్

గోకవరం, జూలై 5: మతిస్థిమితం లేని మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవీపట్నం మండలం సీతారం గ్రామానికి చెందిన ఈక సుబ్బలక్ష్మి బీఈడీ వరకు చదువుకుంది. సుమారు ఐదేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి చెందడంతో అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి బాగోలేదు. శుక్రవారం తెల్లవారుజామున ఆమె గోకవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా గోకవరం గ్రామానికి చెందిన ఎడ్ల సూరిబాబు వెళ్లి మద్యం తాగేందుకు డబ్బులుగానీ, బంగారంగానీ ఇవ్వాలని కత్తితో బెదిరించాడు. దీంతో సుబ్బలక్ష్మి అతని నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా చేతిలో ఉన్న చాకుతో కుడి చెయ్యి, కుడి బుగ్గపై గాయపర్చాడు. ఈ ఘటనపై బాధితురాలి సోదరుడు ఈక రాంబాబు ఫిర్యాదు మేరకు సూరిబాబుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా నిందితుడికి 15 రోజులు రిమాండు విధించినట్టు ఎస్ఐ కూన నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రాజవొమ్మంగి జూలై 5: జడ్డంగి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం జడ్డంగి గ్రామానికి చెందిన ఒడ్డు రాంబాబు అనే వ్యక్తి జడ్డంగి నుంచి రాజవొమ్మంగి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును గమనించకుండా ముందుకు వెళ్లడంతో మట్టి దిమ్మను ఢీ కొనడంతో దూరంగా ఎగిరిపడ్డాడు. రాంబాబు పడిన ప్రాంతంలో గాజు సీసా పెంకులు ఉండడంతో అవి ముఖానికి గుచ్చుకొని రాంబాబు గాయపడ్డాడు. పోలీసులు క్షతగాత్రుడిని జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సత్యదేవుడి సన్నిధిలో ఎమ్మెల్యే గోరంట్ల పూజలు



గోరంట్లకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ఈవో

అన్నవరం, జూలై 5: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి శుక్రవారం విచ్చేసిన రాజమహేంద్రవరం రూరల్ సీనియర్ శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం ఎమ్మెల్యే గోరంట్లకు వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

11వ పీఆర్సీలో మోసం చేసిన జగన్‌కు 11 సీట్లే

- ప్రభుత్వ పాఠశాలలకే 'తల్లికి వందనం' ఇవ్వాలి
- జీవో నెం.117 తక్షణం రద్దుచేయాలి
- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

అమలాపురంటౌన్, జూలై5: ప్రాథమిక విద్యారంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎస్టీయూ రాష్ట్రఅధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ విమర్శించారు. జగన్ తుగ్లక్ పాలనతో మొత్తం విద్యారంగమే నిర్వీర్యమైందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 11వ పీఆర్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసంచేసిన జగన్‌కు రాష్ట్ర ప్రజలు 11 సీట్లే కేటాయించారని ఎద్దేవా చేశారు. ఎస్టీయూ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.117 విద్యారంగానికి తీరని నష్టం చేకూర్చిందన్నారు. దాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా పల్లె బడులు మూతపడే ప్రమాదం ఏర్పడిందన్నారు. 1, 2 తరగతుల్లో అడ్మిషన్లు తగ్గిపోయాయన్నారు. నాటి ప్రభుత్వ జీవోతో ఒక్కో ఉపాధ్యాయుడు 42 పీరియడ్లు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడడంతోపాటు నాన్ టీచింగ్ యాక్టివిటీలు పెరిగిపోయాయన్నారు. టాయిలెట్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి ఎన్నో యాప్‌లను ఉపాధ్యాయులే చూడాల్సిన పరిస్థితి నుంచి బయటపడేలా ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరుతూ ఇప్పటికే విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందించామన్నారు. గత ప్రభుత్వం పరీక్షా విధానాన్ని సైతం లోపభూయిష్టంగా మార్చేసిందన్నారు. సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ, ఐబీ సిలబస్ అంటూ మాతృభాషకు తీరని అన్యాయం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. విద్యార్థులు ఏ సిలబస్‌లో చదవాలో తెలియని అయోమయ పరిస్థితి కల్పించారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు రూ.25 వేల కోట్లకు పెంచేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని, అప్పుడే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అవుతుందన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతోపాటు ఐఆర్ ప్రకటించాలని లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నాటి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమించిన ఉపాధ్యాయులపై కేసులు పెట్టడంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, వారికి మోక్షం కల్పించాలని కోరామన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయడంతోపాటు 1998, 2008 ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని కోరామన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, అభయ్ కన్వీనర్ రాపాక ప్రసాద్, స్టేట్ కౌన్సిలర్ బోనం గంగాధర్ పాల్గొన్నారు.

జి.యర్రంపాలెంలో డ్వాక్రా మహిళల ఆందోళన

ఎమ్మెల్యే బత్తుల సంఘీభావం





బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న బత్తుల.. ఎమ్మెల్యేకు హామీ పత్రం ఇస్తున్న బ్యాంకు అధికారులు

దివాన్‌చెరువు, జూలై5: రాజానగరం మండలం జి.యర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా బిజినెస్ కరస్పాండెంట్ తమను దగా చేశాడని న్యాయం చేయాలంటూ బాధిత మహిళలు శుక్రవారం బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్దసంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆందోళనకారుల వద్దకు చేరుకుని వారికి మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. బ్యాంకు, డీఆర్‌డీఏ అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకులో రెండేళ్లుగా మోసం జరుగుతోందని, డ్వాక్రా మహిళలు బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌కు సొమ్ము చెల్లించేవారన్నారు. ఆ సొమ్ము తీసుకుని బీసీ స్టాంప్ వేసి రిఫరెన్స్ నెంబర్ నమోదు చేసి రశీదు ఇచ్చేవారని, వాటిని డ్వాక్రా మహిళలు నమ్మి భద్రపర్చుకున్నారన్నారు. పాసుబుక్ ఎంట్రీలు వేసి ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా బ్యాంకు సిబ్బంది ఏవో సాకులు చెప్పి కాలయాపన చేశారన్నారు. బీసీకి సొమ్ము చెల్లించిన విషయం బ్యాంకు సిబ్బందికి, యానిమేటర్‌కు కూడా తెలుసని చెప్పారు. జి.యర్రంపాలెంతోపాటు కొండగుంటూరు, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలు, అలాగే బంగారు పంట రుణాలకు సంబంధించి రూ.57,70,950 దుర్వినియోగం చేసినట్టు ఇంతవరకు పరిశీలనలో తేలిందన్నారు. ఇంకా జి.యర్రంపాలెంలోని 17 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన లావాదేవీలను పరిశీలిస్తున్నారన్నారు. అనధికారికంగా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు స్కామ్ జరిగినట్టు తెలుస్తోందన్నారు. తమ ఆందోళనతో దిగివచ్చిన బ్యాంకు ఉన్నతాధికారులు 45 రోజుల్లో బాధితులకు సొమ్ము చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తోరాటి శ్రీను, మద్దిరెడ్డి చినవెంకటేశ్వరరావు, బాబులు, పేపకాయల విష్ణుమూర్తి, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, డీపీడీ జనార్దన్, ఏపీఎం హేమ, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ పి.కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం



రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావు

రైతులకు సబ్సిడీపై విద్యుత్ మోటార్లు : జలగం

చింతూరు, జూలై 5 : చింతూరు మండలంలోని రైతులకు తమ ట్రస్టు ద్వారా సబ్సిడీపై వ్యవసాయ విద్యుత్ మోటార్లు అందించనున్నట్టు ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాదరావు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి తన తండ్రి జలగం వెంగళరావు పేరిట తమ కుటుంబం ట్రస్టు ఏర్పాటుచేయడం జరిగిందని ప్రసాదరావు తెలిపారు. ఇందులో భాగంగా పేద రైతులకు సగం ధరకే సాగు పొలాలకు నీరు అందించేందుకు గాను విద్యుత్ మోటార్లు పంపిణీ చేయాలని సంకల్పించామన్నారు. తన తండ్రి వెంగళరావు ముఖ్యమంత్రిగా, తాను పంచాయతీరాజ్ మంత్రిగా వ్యవహరించిన నాటి నుంచి చింతూరు మండలంలో పరిచయాలు ఉన్నాయన్నారు. ఈమేరకు ఇక్కడి రైతులకు తమ వంతుగా సహకారం అందించదలిచామన్నారు. ఈ క్రమంలో గురు, శుక్రవారాలు చింతూరు మండలంలోని ముకునూరు, నర్సింగపేట, రామన్నపాలెం గ్రామాల రైతులను కలసి వారితో ముచ్చటించడం జరిగిందన్నారు. నదీపరీవాహక ప్రాంత వ్యవసాయదారులు సంప్రదిస్తే వారికి సగం ధర ట్రస్టు ద్వారా చెల్లించి మోటార్లు అందజేస్తామన్నారు. మిగిలిన సగం ధర రైతులు భరించాల్సి ఉటుందన్నారు. ఆయన వెంట పీసీసీ డెలిగేట్ ఎండీ హబీబ్, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ ఎస్కే అహ్మద్అలి, పూజారి పుల్లయ్య, బి.లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



క్యాంపు కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, జూలై 5: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు ఎం.విజయభాస్కర్ శుక్రవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వీకరించిన ప్రతి అర్జీకి సంబంధించి అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. ఇకపై గ్రామాల్లో పర్యటించి సమస్యలను అక్కడే పరిష్కరిస్తామని, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగొద్దని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, పోలీసులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని కలిసి వినతిపత్రం సమర్పించినట్టు గిరిజన గురుకుల నాన్‌టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరి, ప్రధాన కార్యదర్శి మాదే రామచంద్రరావు తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. త్వరలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిని కూడా కలవనున్నట్టు తెలిపారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

వెనుకబడిన మండలాలు మెరుగుపర్చడమే ధ్యేయం : ఎమ్మెల్యే

వై.రామవరం, జూలై5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నీతి అయోగ్ ద్వారా చేపడుతున్న బృహత్తర కార్యక్రమం సంపూర్ణత అభియాన్ అని, దీని ద్వారా దేశంలోని అభివృద్ధిలో వెనుకబడిన మండలాలు గుర్తించి అభివృద్ధిపర్చడమే మోదీ ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి అన్నారు. శుక్రవారం వై.రామవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నీతి అయోగ్ ద్వారా మండల నోడల్ అధికారి ఎంపీడీవో బాపన్నదొర, కోఆర్డినేటర్ హెప్సిబా వినీల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూరుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు.

అల్లూరి జిల్లాలో మూడు మండలాలు

నీతి అయోగ్ ద్వారా సంపూర్ణత అభియాన్‌లో చేపడుతున్న ఈ కార్యక్రమంలో దేశంలో 500 వెనుకబడిన బ్లాకులు గుర్తించినట్టు నీతి అయోగ్ సెంట్రల్ నోడల్ అధికారి సూర్యతేజ్ తెలిపారు. అల్లూరి జిల్లాలో వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాలను ఎంపిక చేయడం జరిగిందని గ్రామాల్లో ఉన్న సమస్యలు గుర్తించి ఆయా గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, ఎంఈవో తాతబ్బాయిదొర, వ్యవసాయాధికారి ఉషారాణి, ఐసీడీఎస్ సీడీపీవో సుధారాణి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, గొర్లె శ్రీకాంత్, జనసేన నాయకుడు పుష్పరాజు, పాల్గొన్నారు.

వరద ముందస్తు చర్యలపై గ్రామ సభలు

కూనవరం, జూలై5: రానున్న వరదలను దృష్టిలో పెట్టుకుని కూనవరం మండలంలో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. తొలిరోజు రేగులపాడు, లింగాపురం, అబిచర్ల, కూటూరు, పెద ఆర్కూర్, చిన ఆర్కూర్, పోచవరం, కాచవరం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వరదలు దృష్టిలో పెట్టుకుని తమ గ్రామాల్లో బఫర్ స్టాక్ ఏర్పాటుచేయాలన్నారు. నిత్యావసర వస్తువులతోపాటు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ సహాయకులు జె.సత్యనారాయణ, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యుఎస్, మండల విద్యాశాఖాధికారి, వెలుగు ఏపీఎం, హౌసింగ్ ఏఈ, నాయకులు సోమక సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోల బహుకరణ

మోతుగూడెం,జూలై5: మోతుగూడెం గ్రామ సచివాలయానికి శుక్రవారం మోతుగూడెం టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, టీడీపీ కార్యకర్తలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ ఫొటోలను మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి రవినాయక్ చేతికి అందజేసి సచివాలయంలో పెట్టమని తెలియజేశారు.

విద్యుత్ షాక్‌కు పాడి గేదెలు మృతి



రాజవొమ్మంగి జూలై 5: రాజవొమ్మంగి మండలంలో విద్యుత్ తీగలు తగిలి పాడిగేదెలు బూడిదైపోయిన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని జడ్డంగి గ్రామానికి చెందిన కాకురు వెంకటేశ్వర్లుకు చెందిన మూడు గేదెలు, బాబ్జీకి చెందిన ఒక గెదె గత నాలుగు రోజులుగా కనిపించట్లేదంటూ చుట్టుపక్కల గ్రామాల్లో వెతకసాగారు. అయితే జడ్డంగి గ్రామ శివారు మడేరు ఆనకట్ట సమీపంలో విద్యుత్ షాక్‌కు ఈ నాలుగు గేదెలు చనిపోయి ఉన్నాయని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి సంబంధిత రైతులకు విషయం తెలియజేయడంతో రైతులు తమ పాడి గేదెలను చూసి ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగు గేదెల్లో మూడు గేదెలు పూర్తిగా దగ్ధమైపోయాయి.

17,878 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

- సాగు లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- వ్యవసాయ, అనుబంధ రంగాల పురోగతిపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 5: జిల్లాలో 77,817 హెక్టార్లలో సాగు లక్ష్యం కాగా ఇప్పటికి 17,878 ఎకరాల్లో వరి నాట్లు (23శాతం) పూర్తయినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ ప్రాథమిక రంగాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యమిస్తూ, మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఆయా మార్గదర్శకాలు మేరకు కార్యాచరణ సిద్ధం చేసుకుని ముఖ్యమంత్రి నిర్వహించే సమీక్ష సమావేశాలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. వ్యవసాయ రంగానికి చెంది రానున్న ఖరీఫ్ సీజన్ ముందస్తు ఏర్పాట్లుపై సమీక్ష చేశారు. ఇప్పటికే సాగునీరు విడుదల చేశామని, ఆయా ప్రాజెక్టల దిగువన ఉన్న సాగు లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. నాట్లు వేసేందుకు విత్తనాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాయని, రైతు రైతు మధ్య సుమారు 29వేల క్వింటాళ్లు, ప్రైవేటు వ్యక్తుల ద్వారా సుమారు 10 వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మట్టి పరీక్షలకు సంబంధించి 75శాతం లక్ష్యాలకు గాను 84శాతం అదనంగా పురోగతి సాధించినట్టు తెలిపారు. అవసరమైన ఎరువుల లభ్యత ఉందని, ఎరువులు ప్రభుత్వ గోడౌన్‌లలో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ఖర్చులను తగ్గించే అవకాశం ఉందన్నారు. అలాగే మత్స్యరంగం, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానసాగు సాగు విస్తీర్ణం, నీటి వసతులు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏపీఎంఐపీ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా మార్కెటింగ్ ఏడీ ఎం.సునీల్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, హార్టీకల్చర్ అధికారి శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయాధికారి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే సహించం

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- 15 రోజుల్లో స్వచ్ఛ గ్రామాలుగా తయారుకావాలి
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



సమీక్ష సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూలై 5: విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే సహించబోమని, అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను సమస్యల రహితంగా తయారు చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. దీంతో ఆయన 2014నుంచీ తాను ఎమ్మెల్యేనని, 2019-24లో వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా వున్న సంగతి గ్రామ కార్యదర్శుల నుంచి ఎంపీడీవో, డీఎల్‌పీవోలు మర్చిపోయారని సున్నితంగా చురకలంటించారు. గత ప్రభుత్వ పాలనలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. పంచాయతీలను దగాచేసి అప్పులు మిగిల్చిందని మండిపడ్డారు. పారిశుధ్యం అధ్వానంగా తయారైందన్నారు. కనీసం వీధిలైట్లు కూడా వేయలేని స్థితికి వైసీపీ ప్రభుత్వం దిగజారి పోయిందని ఆరోపించారు. 15 రోజుల్లో గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా తయారు కావాలని అధికారులను హెచ్చరించారు. పంచాయతీల్లో ఇంతమంది సిబ్బంది వున్నా పారిశుధ్యం ఎందుకు మెరుగు పరచడం లేదంటూ నిలదీశారు. సిబ్బంది అంతటితో పంచాయతీ పరిధిలోనే పనిచేయించుకోనే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై వుందన్నారు. కొంతమంది అధికారుల ఇంటి వద్ద, ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్నారని, తక్షణమే వీటిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. గతంలో దాతల సహకారంతో మంచినీటి (ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్) ఏర్పాటు చేశామని, వాటిని కూడా నిర్వహించలేని పరిస్థితిలో పంచాయతీలు ఉన్నాయని, సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ యూనిట్లు గ్రామ గ్రామాన నిర్మించామని, వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయంటూ అధికారులను ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ ఉద్యోగులు వేరువేరు కాదని వీరంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి ఒకరి భూమి మరొకరికి మార్చి వారిలో వారికి తగాదాలు సృష్టించారని, ఒక్క రూరల్ మండలంలోనే సుమారు 70 ఎకరాలు మాయమయ్యాయన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులపై విచారణ చేపట్టనున్నట్టు చెప్పారు. అన్ని సచివాలయాల పరిధిలో ప్రభుత్వ స్థలాలు, భూముల ఆక్రమణలుంటే వాటన్నింటిని గుర్తించాలని, వాటిపై చర్యలు చేపడమని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు. మండలంలో జరిగిన పింఛన్ల పంపిణీపై అధికారులను అభినందించారు. కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, గంగిన హనుమంతరావు, మండల ప్రత్యేకాధికారి ఎన్.జ్యోతి, డీఎల్‌డీవో వీణాదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సజ్జ పంటతో రైతులకు ఆర్థిక ప్రయోజనం

- ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు
- సజ్జ సమగ్ర పంట యాజమాన్య శిక్షణ



సజ్జ పంటపై సాంకేతిక కరపత్రం ఆవిష్కరిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

రాజానగరం/కోరుకొండ, జూలై 5: రైతులు మూడో పంటగా సజ్జను సాగుచేస్తే ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు రైతులకు సూచించారు. కోటికేశవరంలోని రైతు భరోసా కేంద్రం వద్ద సజ్జ సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై శుక్రవారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మూడో పంటగా సజ్జ పంటను సాగు చేస్తే నాణ్యమైన, పోషక విలువలున్న చిరు ధాన్యపు పంటను ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకుని ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు చీడపీడల తాకిడి స్వల్పంగా ఉంటుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త పి.అమ్మాజీ మాట్లాడుతూ తక్కువ నీరు తడులు, ఎరువులతో ఆరోగ్యకరమైన పంటను పొందవచ్చన్నారు. తొలి దశలో కలుపు నివారణ సమతుల్యమైన ఎరువులను వాడుతూ కేవలం 2,3 నీరు తడులతో పంటను తీసుకోవచ్చన్నారు. మరో ప్రధాన శాస్త్రవేత్త ఎస్.హైమజ్యోతి మాట్లాడుతూ 70-85 రోజుల్లో వేసవి పంటగా పండిస్తే, ఎకరాకు నికరాదాయం రూ.20 వేలు వరకు పొందవచ్చన్నారు. మరో ముఖ్యఅతిథి, వ్యవసాయశాఖ ఏడీఏ మల్లికార్జునరావు మాట్లాడుతూ జిల్లాలో సజ్జ, కొర్ర వంటి పంటల పట్ల రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నామని, ఈ ఏడాది కొంత విస్తీర్ణం చిరుధాన్యాల సాగుకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీఏడీఏ జయరామలక్ష్మి, ఏవో గౌరీదేవి, వీఏఏలు, అభ్యుదయ రైతులు ముంద్రు వీరభద్రరావు, ఇసుకముల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇస్కాన్ జగన్నాథ స్వామి రథయాత్ర

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 5: గౌతమి ఘాట్ వద్దనున్న అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ రథ మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రథయాత్ర ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమవుతుందని ఇస్కాన్ రాజమహేంద్రవరం కమిటీ ఛైర్మన్ శివానంద నిమాయదాస్ అన్నారు. రాత్రి 7గంటలకు శ్రీజగన్నాథ లీలలపై ప్రవచనం ఉంటుందని, తదుపరి విందు భోజనం ప్రసాద వితరణతో మహోత్సవం ముగుస్తుందన్నారు. రథయాత్రలో భక్తులంతా పాల్గొనాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు రవీంద్ర చైతన్య దాస్,శ్యామాంగ శ్రీనివాస్ దాస్ పాల్గొన్నారు.

45 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 5: వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ (స్వచ్ఛంద సేవా సంస్థ) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఎస్‌కేవీటీ డిగ్రీకళాశాల ఆనంద గార్డెన్స్‌లో శుక్రవారం 45 మంది పేద విద్యార్థులకు రూ.3.50 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అలాగే 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛన్లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఏబెల్ రాజబాబు, క్రాంతి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ కంటే వీరన్నచౌదరి, తమనంపూడి రామిరెడ్డి, విక్రమ్ జైన్, చిన్నవెంకన్న స్వామిజీ, మతల రమేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 5: ప్రతి ఒక్కరు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు అన్నారు. రాజమహేంద్రవరం గాంధీపురం-2 ఉన్నత పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిశుభ్ర వాతావరణం, కలుషిత నీరు డయేరియాకు కారణమన్నారు.అనంతరం డాక్టర్ ఆలేఖ్య మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే ముందు తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యఆరోగ్యశాఖ రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం డి.నీలిమ, ప్రధానోపాధ్యాయుడు ఆర్.సన్యాసిరావు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 5: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 41వ డివిజన్‌లోని 82 సచివాలయంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌ల ఫొటోలను ఏర్పాటు చేశారు. 41వ డివిజన్ ఎన్‌డీఏ కూటమి నాయకుల సౌజన్యంతో వీటిని సచివాలయంలో గోడకు అమర్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపుతో ఈ చిత్రపటాలను ఏర్పాటు చేశారు.

ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ ఎస్ఏ) కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు స్పష్టం చేశారు. సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలును శుక్రవారం సందర్శించారు. అండర్ ట్రయల్ ముద్దాయిల రివ్యూ కమి టీ ముందస్తు సమావేశంలో భాగంగా ఓరియంటేషన్ సెషన్ నిర్వహించారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి తెలియజేయా లని పారా లీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులను ఆదే శించారు. వారికి ఎలాంటి సమస్యలున్నా సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు జె.మహేశ్, పీఎంజే ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జనసేన నేత అనుశ్రీకి అతిథి అధ్యాపకుల వినతి



అనుశ్రీకి వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 5: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని బాధిత అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. అతిథి అధ్యాపకులు రాజమహేంద్రవరంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. యువగళం పాదయాత్రలో సమస్యలు విన్నవించామని లోకేశ్ పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని అనుశ్రీ హామీఇచ్చారు. మాజీ స్వాయి సంఘం ఛైర్మన్ బర్రే కొండబాబు క్వారీ ప్రాంతంలో గోతులను పూడ్చించేలా చూడాలని 2011 నుంచి ఉద్యమిస్తున్నా ఫలితం కానరాలేదని, అధికారుల సమక్షంలో ఒప్పుకున్న క్వారీ యాజమానులు మాట నిలబెట్టుకోలేదని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీహెచ్ వీరబాబు, మాసా నాని, గుల్లా సునీల్‌కుమార్, సతీష్ ఉన్నారు.

కోరుకొండలో కోటి శివలింగాల తయారీ

కోరుకొండ, జూలై 5: కోరుకొండ హరేరామ సమాజం ఆవరణలో కోటి శివలింగాల తయారీ కొనసాగుతోంది. పలువురు మహిలు పాల్గొని బంకమట్టితో కోటి శివలింగాలు తయారు చేస్తున్నారు. వీటిని వారణాసి తరలిస్తారని ప్రత్యేక పూజలు చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కోటి శివలింగాలు తయారీ కార్యక్రమం వారం రోజులు జరుగుతుందని బదిరెడ్డిదొర, బదిరెడ్డి తులసి, కర్రి వీరగణేష్, కటకం చలం పేర్కొన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు, జూలై 5: శిశువులు, తల్లుల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగపు అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొంకుదురులో శుక్రవారం ఆయన మండలాధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డితో కలసి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్తి తాతారెడ్డి, అంగన్వాడీ సిబ్బంది పైలి వెంకటలక్ష్మి, నేకూరి సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



దుళ్లలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేసిన దాత కిరణ్

కడియం, జూలై 5: మండలంలోని దుళ్లలో నెంబర్-1, నెంబర్-2 పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన కంటిపూడి కిరణ్‌కుమార్ శుక్రవారం నోట్‌బుక్స్ సమకూర్చారు. వీటిని కిరణ్‌కుమార్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు కంటిపూడి బాలకృష్ణ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు, తోకల శ్రీనివాసరావు, హెచ్‌ఎం గెద్దం ఆనంద్, శశికుమారి, గంపల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



తిరుమల వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి దంపతులు

అనపర్తి, జూలై 5: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డితో కలిసి స్వామికి పూజలు చేశారు. శ్రీవారి ఆశీస్సులతో కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే స్వామి దర్శనానికి వచ్చిన చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య దంపతులను నల్లమిల్లి దంపతులు ఆలయ ప్రాంగణంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నల్లమిల్లి వెంట వెంకటకృష్ణారెడ్డి దంపతులు, గొలుగూరి వీర్రాఘవరెడ్డి, సాగర్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాన్ని నెరవేర్చాలి

అనపర్తి, జూలై 5: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సర్పంచ్ గిరిడా గంగాభవాని అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తేనెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత

దివాన్‌చెరువు, జూలై 5: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 అధికారి ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. వన మహోత్సవం సందర్భంగా తమ దత్తత గ్రామమైన దివాన్‌చెరువులోని ఎంపీపీ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 5: స్థానిక సాయికృష్ణ థియేటర్ వద్దనున్న గవర్నమెంట్ స్కూల్ పూర్వ విద్యార్థులతో అలుమ్ని చారిటబుల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ట్రస్ట్ గౌరవ సహాయ కార్యదర్శి ఆడిటర్ కందర్ప కుమార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. ఎస్ఎల్ రామ్‌చరణ్‌కు ప్రథమ, పి.ఆదిత్యశ్రీకి ద్వితీయ, కె.ప్రవీణ్‌కు తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దేవత సుధాకర్, ఎన్ఎస్ఆర్ మూర్తి, గంటి సూర్యనారాయణమూర్తి, అడ్వకేట్ అల్లు దుర్గా ప్రసాద్, కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో చైతన్య విద్యార్థులకు గోల్డ్‌మెడల్



రాజమహేంద్రవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి కిక్ బాక్సింగ్ అండర్-12 విభాగంలో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. షేక్ సనా, షేక్ రెహానా మొదటి బహుమతిగా బంగారు పతకాన్ని సాధించారని ప్రిన్సిపాల్ (సివిల్స్) లక్ష్మీసౌజన్య పేర్కొన్నారు. అండర్-14లో రెండో బహుమతి సాధించిన షేక్ సాధిక్, ఎం.రాహిత్యలను అభినందించారు. లక్ష్య సాధనకు క్రమశిక్షణ మార్గమని శ్రీ చైతన్య ఏజీఎం ఏవీ సురేశ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రామారావు, సివిల్స్ బ్యాచ్ ఇన్ చార్జి షేక్ అలీషా తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 5: జిల్లాలో గడచిన 24గంటల్లో గోపాలపురం మండలంతో అత్యధికంగా 33.8 మీమీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా బిక్కవోలులో 0.4 మి.మీల వర్షం పడింది. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లాలో శుక్రవారం ఉదయం 8:30 గంటలలోపు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం డివిజన్ అనపర్తిలో 13.6 మి.మీ, గోకవరం 2.2 మి.మీ, కడియం 10.8 మి.మీ, కోరుకొండ 10 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్ 12.6 మి.మీ, అర్బన్ 12.4 మి.మీ, రాజానగరం 10 మి.మీ, రంగంపేట 16.8 మి.మీ, సీతానగరం 7.0 మి.మీ, వర్షపాతం నమోదైంది.ఈ డివిజన్‌లో సగటున 8.7 శాతం వర్షం పండింది. కొవ్వూరు డివిజన్‌లో చాగల్లు 18.4 మి.మీ, దేవరపల్లి 18.2 మి.మీ, కొవ్వూరు 18.2 మి.మీ, నల్లజర్ల 33.6 మి.మీ, నిడదవోలు 18.2 మి.మీ, పెరవలి 14.8 మి.మీ, తాళ్ళపూడి 12.6 మి.మీ,ఉండ్రాజవరం 13.8 మి.మీ కలిపి మొత్తం కొవ్వూరు డివిజన్‌లో 20.2 శాతం వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 269.0 మి.మీ వర్షం కురిసిందని వాతావరణ హెచ్చరిక కేంద్రం తెలిపింది.



నేడు ఎంపీ పురందేశ్వరి రాక

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం రాజమహేంద్రవరం విచ్చేయనున్నారు. న్యూఢిల్లీలోని లోక్‌సభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం రాజమహేంద్రవరం వస్తున్నారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.



పోలీస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ జగదీశ్

అదృశ్యం కేసులపై దృష్టి

- ప్రతి స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయండి
- జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జగదీశ్ ఆదేశం

రాజమహేంద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యం(మిస్సింగ్) కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. 'ఏమైపోతున్నారు వీళ్లు' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 8 ఏళ్లలో 560 మంది బాలలు, బాలికలు, మహిళలు, పురుషులు జాడ లేకపోవడంపై కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీంతో ఎస్పీ జగదీశ్ జూమ్ కాన్ఫరెన్స్ విధానంలో అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల పరిస్థితిపై ఆరా తీశారు. త్వరితగతిన పెండింగ్ కేసుల పరిష్కరించే కార్యాచరణపై చర్చించారు. మిస్సింగ్ కేసులపై సరైన రీతిలో వేగంగా స్పందించాలని, దర్యాప్తులో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో కారణాలను గుర్తించడంలో చొరవ చూపాలన్నారు. బాధితులు లేదా బాధిత తల్లిదండ్రులు స్టేషన్‌కి వచ్చిన సందర్భంలో వారికి ధైర్యం చెప్పి సముదాయించాలన్నారు. స్నేహపూర్వకంగా వారితో మాట్లాడి సాధ్యమైనంత ఎక్కువ సమాచారాన్ని రాబట్టాలన్నారు. ఆధునిక సాంకేతికత సహాయంతో తక్షణమే రంగంలోకి దిగాలని చెప్పారు. ఏ మాత్రం పోలీసుల అలసత్వం ఉందని రుజువైతే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మిస్సింగ్ కేసులకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. ఈ విషయంలో ప్రజలు కూడా తమ వంతు సహాయ సహకారాలను పోలీసులకు అందించాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే దగ్గరలోని పోలీసులకు లేదా డయల్ 112కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అవసరమైతే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.



జీజీహెచ్‌లో జలగలపై చర్యలేవి?

ప్రక్షాళన చేస్తామని వదిలేసిన సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ఎంఎన్‌ఓలు రోగులను జలగల్లా పీడిస్తున్నారని, ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ వంటి వాటికి వేలకు వేలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తినా అవినీతిపరులపై చర్యలు తీసుకోవడానికి వైద్యాధికారులు వెనుకాడుతున్నారు. అవినీతికి కేరాఫ్‌గా ఉన్న అసలు మూలాలను వదిలేసి చిరుద్యోగులపై ప్రతాపం చూపుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో జలగలు పేరుతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన వార్త నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ వివరణ ఇస్తూ నలుగురు ఎంఎన్‌వోలను విధుల నుంచి మార్చడం జరిగిందని తెలిపారు. ఎంఎన్‌వో విభాగాన్ని ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్‌వైజర్ విషయంలో సూపరింటెండెంట్ ఆచితూచి స్పందించడం గమనార్హం. ఎంఎన్‌వోలను ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు మార్చేశామని చెబుతూ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేస్తుండడం ఆసుపత్రి చిరుద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ఎంఎన్‌వోలకు డ్యూటీ రోస్టర్ వేసే సమయంలోనే భారీగా అవకతవకలు జరుగుతున్నాయంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వస్తుండగా, డ్యూటీ రోస్టర్ సిద్ధం చేస్తున్న ఎంఎన్‌వో స్థాయి ఉద్యోగిని పక్కకు తప్పించకుండా తూతూ మంత్రంగా ఇతర ఎంఎన్‌వోలను మార్చేయడం వల్ల అంటుకున్న అవినీతి మరక ఎలా పోతుందనే భావన చాలా మంది ఎంఎన్‌వోల్లో వ్యక్తమవుతోంది. ఆసుపత్రి పరువు రోడ్డున పడుతున్నా పట్టించుకోకుండా ఒక్క ఎంఎన్‌వో కోసం జీజీహెచ్ అధికారులు తమను బలిపశువులను చేస్తున్నారనే అభిప్రాయం చిరుద్యోగుల్లో ఉంది.

36 మందిలో.. ముగ్గురికే అందలం

- అప్కాస్ సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా మాత్రమే
- కమిషనర్ దినేష్‌కుమార్ స్పష్టీకరణ
- 33 మంది భవిష్యత్ అయోమయం

రాజమహేంద్రవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అప్కాస్ సిబ్బందిలో ఎవరైనా విధులు నిర్వహిస్తూ మరణిస్తే వారికి ఎక్స్‌గ్రేషియా మాత్రమే చెల్లించడం జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ దినేశ్ కుమార్ స్పష్టం చేశారు. 33 మంది డ్రైవర్లు, కారుణ్య నియామకాల విషయంలో జరుగుతున్న అన్యాయంపై 'కమిషనర్ సారూ.. ఇదేం తీరు' అనే శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై కమిషనర్ శుక్రవారం స్పందించారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ వద్ద కారుణ్య నియామకాలకు సంబంధించి రెండు దరఖాస్తులు మాత్రమే ఉన్నాయన్నారు. తడిచెత్త-పొడిచెత్త వాహనాలపై పనిచేయడానికి కాంట్రాక్టరుచే సరఫరా చేయబడిన 36 మంది డ్రైవర్లలో అధికారుల వద్ద క్రమశిక్షణతో పని చేస్తూ, మంచి నైపుణ్యం కలిగిన ముగ్గురు డ్రైవర్లను వారి అభ్యర్థన మేరకు కలెక్టర్ ఆదేశాలతో అప్కాస్ పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నామన్నారు. మిగతా 33 మంది డ్రైవర్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 36 మంది డ్రైవర్లలో ముగ్గురిని అధికారుల వద్ద పనిచేయడమే అర్హతగా పరిగణించి అందలం ఎక్కించడానికి సిద్ధమైనట్లు 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది. మరి మిగతా 33 మంది పని తీరుకు కొలమానం ఏమిటనేది ప్రశ్నగానే ఉంది.

పెంపుడు జంతువులైనా.. ప్రాణాంతకమే! 8

భూ..మంతర్!



రూ.80 కోట్ల విలువైన భూమి హాంఫట్

- వైసీపీ నేతల భూదాహం
- అధికారుల మాయాజాలం
- 23.33 ఎకరాల భూబాగోతం
- భూమి విలువ రూ.80 కోట్లు
- సర్వే నెం 21/13ఎన్‌లో అక్రమాలు
- ఏ1 రిజిస్టర్ లేని వారి పేరన హక్కు
- రూరల్ తహశీల్దార్ ఆఫీస్‌లో తీరు
- వారసులను మార్చేసిన వైనం
- రికార్డుల్లో చూపిన అధికారులు
- చేతులు మారిన కోట్లు

సాధారణంగా ఎవరికైనా ఆస్తి వారి పూర్వీకుల నుంచి సంక్రమిస్తే వారసత్వ హక్కుతో వారసులకు అనువంశికంగా వస్తుంది.. కొనుగోలు చేస్తే ఇతరుల నుంచి సంక్రమిస్తుంది. కొన్ని సందర్భాల్లో వీలునామా, దానపట్టా ద్వారా కూడా కుటుంబీకులకు ఒకరి నుంచి మరొకరికి దాఖలు పడుతుంది. రాజమహేంద్రవరంలో అలాకాదు.. ఎక్కడైనా సరే ఖాళీ భూమి చూస్కోండి.. ఎటువంటి వారసత్వం లేకపోయినా ముడుపులు తీసుకొని ఆ భూమిని మన పేరున మార్చేస్తారు.. ఈ తంతు అంతటికీ కొంత మొత్తం ఖర్చవుతుందంతే.. దీనిపై వివరాలు కావాలంటే మాత్రం రాజమహేంద్రవరం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయం అధికారులను సంప్రదించాల్సిందే మరి.. ఎందుకంటే ఇప్పటికే సుమారు రూ.80 కోట్ల విలువైన 23.33 ఎకరాల ఆస్తికి రికార్డులు మార్చి వేరొకరికి అను వంశికంగా చెందినట్టు చేసిన ఘనులున్నారు..


రాజమహేంద్రవరం రూరల్, జూలై 5 : డబ్బుతో కానిది ఏమైనా ఉంటుందా..అధికారులు తలచుకుంటే ఎందుకు కాదు.. రాత్రికి రాత్రి ఒకరిని భూస్వామిని చేసేస్తారు.. వారసులు లేని భూమికి యజమానిని చేసేస్తారు..పైసలు తీసుకుని పత్రాలే మార్చేస్తున్నారు. రెవెన్యూ డిపార్టుమెంటులోని కొందరు అధికారులు ల్యాండ్ రికార్డులు మార్పులు చేసి లేని వారి పేర్లను సృష్టిస్తారు.రాజమండ్రి రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో అదే చేశారు.

భూమికి వారసుడిని సృష్టించారు..

భూదాన ఉద్యమంలో భాగంగా 21/13 సర్వే నెంబరులో భూమిని అప్పారావు అనే అతనికి 1970 ప్రాంతంలో కేటాయించారు.పెద్దాపురం రెవెన్యూ పరిధిలో ఉండగా కేటాయింపులు జరిగాయి.ఈ భూమికి సరిహద్దుగా ఒక లేఅవుట్ వచ్చింది.ఆ సమయంలో ఈ భూమి ఎవరి ఆధీనంలో లేదని బయటకు పొక్కింది.ఈ విషయం ఆనోటా ఈ నోటా వైసీపీ నాయకులకు తెలిసింది. అధి కారంలో ఉండడం.. జిల్లాల విభజన జరడంతో 2020వ సంవత్సరంలో వారసుడు లేని భూమికి వారసుడిని సృష్టించారు. ఈ మార్పిడి వ్యవహారంలో గ్రామ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు కోట్లలో చేతులు మారినట్టు కొంతమంది రెవెన్యూ అధికారులే చెప్పడం విశేషం. ఇదిలా ఉండగా ఇటీవల భూమిని సబ్ డివిజన్ చేసుకోవడానికి దరఖాస్తు చేయడంతో విషయం వెలుగుచూసింది. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున చేతులు మారినట్టు సమాచారం. ఈ భూమి అప్పారావు అనే హిందువుకి చెందినదిగా పూర్వపు అడంగళ్‌లో నమోదై ఉంది. అయితే ఒక ముస్లింకి అను వంశికంగా వచ్చినట్టు రెవెన్యూ రికార్డుల్లో చూపారు. ఇదెలా సాధ్యమైందనేది అధికారులకెరుక..

23.33 ఎకరాల భూమి

రాజమహేంద్రవరం రూరల్ మండలం మోరంపూడి పరిధిలో సర్వే నంబరు 21-13ఎన్ సుమారు 23.33 ఎకరాలు భూమికి మీర్ ఇనామత్ ఆలీ పేరున రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేశారు. అడంగల్‌లో కూడా అనువంశికం ద్వారా సంక్రమించిన ఆస్తిగా నమోదు చేశారు. అయితే ఏ-1 రిజిస్టరులో ఇతని పేరుగాని, తండ్రిపేరుగాని దఖలు పడలేదు. రెవెన్యూ అధికారులు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలంటే తమ పూర్వీకుల పేరుతో సరిపడా వారసత్వాన్ని నిరూపిస్తూ అన్ని డాక్యుమెంట్లను సమర్పించాలి. వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించిన మీదట మాత్రమే తమ పేరున నమోదు చేస్తారు.అసలు మీర్ ఇనామత్ ఆలీకి సంబంధించి ఎలాంటి పత్రాలు ఏ-1 రిజిస్టరులో లేనపుడు ఆయన పేరున భూ యాజమాన్య హక్కు పత్రాలు ఎలా మంజూరు చేశారనేది అర్థంకాని ప్రశ్నగా ఉంది. సామాన్య రైతు కష్టపడి ఎకరమో.. అర ఎకరమో కొనుక్కుంటే వాటిని మ్యుటేషన్ చేయాలంటూ రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే సవాలక్ష ప్రశ్నలు అడుగుతారు. చెప్పులు అరిగేలా తిప్పించుకుంటారు. సుమారు రూ. 80 కోట్ల విలువ గలిగిన 23.33 ఎకరాల భూమిని మీర్‌ఇనామత్‌ఆలీ పేరుతో రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



1970లో బుర్రి అప్పారావు పేరున ఉన్న రికార్డు



రికార్డులో చేరిన మీరా ఇనామత్ ఆలీ పేరు

చక్రం తిప్పిన వైసీపీ నాయకులు

గతంలో మాజీ వైసీపీ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసిన ముస్లిం సామాజికవర్గానికి చెందిన వ్యక్తి చక్రంతిప్పాడనే ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో రూరల్ తహశీల్దార్ రియాజ్ హుస్సేన్ కీలకంగా వ్యవహరించి ఏ-1 రిజిస్టరులో లేకపోయినప్పటికి తప్పుడు రికార్డులు సృష్టించి అవినీతికి పాల్పడ్డారని పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారమంతా గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది.

సబ్ డివిజన్‌కు ప్రయత్నాలు

ఎప్పుడైనా ఒక ఆస్తి రెండు మూడు చేతులు మారితే ఎవరికి ఎలాంటి అనుమానం ఉండదని భూములను చేతులు మార్చుతుంటారు. ఈ నేపథ్యంలోనే సదరు భూమిని తమ కుటుంబీకుల పేరున వాటాలుగా సబ్ డివిజన్ చేయాలంటూ వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు దరఖాస్తు చేసుకున్నారు. సబ్ డివిజన్ చేసేందుకు రెవెన్యూ అధికారులతో బేరం కుదుర్చుకున్నట్టు సమాచారం. ఈ భూములకు సంబంధించి అసలు వారసులు ఉన్నట్టుగా తెలిసింది. అయితే వారిని గత ప్రభుత్వం నయానోభయానో ఇబ్బందులు పెట్టడంతో వారు ఏమి చేయలేని స్థితిలో ఉన్నట్టుగా సమాచారం. ఏది ఏమైనా 23.33 ఎకరాల భూమి దారుణంగా రికార్డులు మార్చి వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అనుచరుడుతో దోచేయడం దానికి అధికారులు సహకరించడం మూకుమ్మడిగా కోట్లాది రూపాయలు చేతులు మారినట్టుగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇదే విధంగా రూరల్ నియోజకవర్గంలో ధవళేశ్వరం, పిడింగొయ్యి, మోరంపూడి ప్రాంతాల్లో బయటకు రాని భూ కుంభకోణాలు అనేకం ఉన్నాయి.గత ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపడంతో ఒక్కొక్కటిగా అక్రమాలు బయటకు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా కలెక్టర్ మారడంతో ఇటువంటి భూరికార్డులు మార్పిడిపై దృష్టి పెట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేసి రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తారా, లేక విడిచిపెడతారో వేచి చూడాలి.

సెబ్..చేసిందేటబ్బా!



పనిచేయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్

- అంతంతమాత్రమే పనితీరు
- సారా నియంత్రించలేదు..
- ఇసుక దోపిడీ అరికట్టలేదు..
- బెల్ట్ తీసిన దాఖలాలు లేవు..
- ఎక్సయిజ్ శాఖ నిర్వీర్యం
- సెబ్ తెచ్చిన వైసీపీ
- ఆ పార్టీకి అండగా తీరు
- మామూళ్ల మత్తు
- సారా బట్టీకింతని డిమాండ్
- కూటమి ఏం చేస్తుందో మరి

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్).. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అంటే ఈ డిపార్ట్‌మెంట్ గురించే చెప్పుకోవచ్చు. ఎందుకంటే వైసీపీ వచ్చిన తరువాత ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ స్థానంలో సెబ్ వచ్చింది.. ఇదీ చేసిందీ లేదు.. వెలగబెట్టిందీ లేదు.. సెబ్ అధికారులు మామూళ్ల మత్తులో సారా నియంత్రించడమే మానేశారు.. దీంతో పల్లెపల్లెనా సారా బట్టీలు.. బెల్ట్ షాపులు పెరిగిపోయాయి.. నాడు చంద్రబాబు హయాంలో బెల్ట్ తీశారు.. సారాను నియంత్రించారు.. సెబ్ అధికా రుల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ ఇప్పుడు సారా ఏరులైపారుతోంది.. ఇక బెల్ట్‌షాపులైతే వీధికొకటి చొప్పున ఉన్నాయి.. మళ్లీ ఇప్పుడు సీఎం చంద్ర బాబు బెల్ట్ తీయాలి.. సారా జోరు అరికట్టాలి.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో. షార్ట్ కట్‌లో సెబ్ అంటారు. 2020లో వైసీపీ ప్రభుత్వం తెర మీదకు తెచ్చింది. ఈ డిపార్ట్‌మెంట్‌కు రెండు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. మందుబాబులను నియంత్రించడం,వినియోగం తగ్గించడం, అక్రమ మద్యం అమ్మకాలు లేకుండా చూడడంతో పాటు సారా లేకుండా చేయడం.. అంతే కాకుండా ఇసుక అక్రమాలు జరగకుండా చూడడం మరొక లక్ష్యం. ఈ డిపార్ట్‌మెంట్‌కు కేసులు పెట్టే అధికారం, అక్రమ ఇసుక, లిక్కర్, సారా స్వాధీనం చేసుకునే అధికారం ఉంది. ఈ మేరకు జిల్లాకు ఒక ఏఎస్పీ స్థాయి అధికారిని, మరో ఏడుగురు అధికారులు, స్టాఫ్‌తో డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసింది. సెబ్ వల్ల ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పాత జిల్లాలో డివిజన్‌లో ఎక్సయిజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ సూపరిం టెండెంట్, సీఐలు పెద్ద ఎత్తున స్టాఫ్ ఉండేవారు. రాజమహేంద్రవరం వై.జంక్షన్ వద్ద ఎక్సయిజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఉండేది. దీంతో నాడు కాస్తయినా భయం ఉండేది.. సెబ్ వచ్చిన తరువాత అసలు భయమే లేకుండా పోయింది.

వైసీపీ పాపాలకు కేరాఫ్ సెబ్

ఈ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వెనుక వైసీపీ పెద్ద కుట్ర పూరితంగా వ్యవహరించినట్టు ఇపుడిప్పుడే అందరికీ అర్థమవుతోంది. గతంలో లిక్కర్, సారా, గంజాయి, డ్రగ్స్ వంటివి అరికట్టే బాధ్యత ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిపార్ట్‌మెంట్‌కు ఉండేది. ఇసుక కుంభకోణాలు అరిక ట్టడం, వాటిపై విచారణలు చేయడం వంటివి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ చూసేది. ఇంకా రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు పట్టించుకునేవారు.స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) తెరమీదకు రావడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ పట్టించుకోవడం మానేసింది. ఈ డిపార్ట్‌మెంట్‌ను అడ్డుపె ట్టుకుని వైసీపీ ఇసుక, లిక్కర్ అక్రమాలకు పాల్పడింది. మద్యం అవుట్ లెట్లను ప్రభు త్వమే ఏర్పాటు చేసి నాణ్యమైన బ్రాండ్లను రద్దు చేసింది. నాసిరకం బ్రాండ్లతో కేవలం నగదు లావాదేవీలతో అమ్మకాలు సాగించి వైసీపీ విపరీ తంగా దోచుకుంది. ఇంత జరుగుతున్నా జిల్లాలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కన్నెత్తి చూడలేదు. ధవళేశ్వరంలో నకిలీ మద్యం అమ్మకాలు బయటపడ్డ తర్వాత కూడా కఠినంగా వ్యవహరించిన దాఖలాలు లేవు.

ఏరులైపారిన సారా

రాజమహేం ద్రవరంసిటీ,రూరల్, రాజానగరం, కోరుకొండ, కడి యం, చాగల్లు మండలాల్లో సారా తయారీ పెరిగిపోయింది. శ్రీరామపురం, పిడింగొయ్యి, నామవరం వంటి ప్రాంతాల్లో సారా ఎక్కువగా కాస్తున్నారు. అంతేకాదు గతంలో పెద్ద గోతులు తవ్వి, మంటవేసి బెల్లం ఊటతో కాసేవారు.ఇటీవల బ్యాటరీ పొయ్యిలు వచ్చాయని చెబుతున్నారు. వీటితో సారా కాస్తే పొగ కనిపించదు. ప్యాకెట్లు, బాటిళ్లలో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఇవేవీ సెబ్ కళ్లకు కనబడవు. ఇతర ప్రాంతాల నుంచి ఒకటో రెండో బాటిల్స్ తెచ్చుకునేవారిని తప్ప మద్యం అక్రమాలపై పెద్దగా కేసులు నమోదు చేసినవి తక్కువే. అదే సమయంలో సారా మీద మొదట్లో బయపెట్టేటట్టు ప్రచారం చేసింది. కానీ అరికట్టలేదు. అప్పట్లో ఒక సీఐ స్థాయి అధికారి ఏడాది ఒక్కో నాటు సారా బట్టీ నుంచి రూ.లక్ష, ఎస్ఐ రూ.50 వేలు, తర్వాత అధికారులు ,సిబ్బంది తమకు అంకిన కాడకు మామూళ్లు తీసుకుని వదిలేసేవారు.

ఇసుకను వదిలేశారు..

ఇసుక అక్రమాలు జిల్లాలో పెద్దఎత్తున జరిగిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జేపీ సంస్థకు ఇసుక కాంట్రాక్టు ఇచ్చినా ఆ సంస్థ ఎంత తవ్వింది, ఎంత మేర తవ్వింది, సరిహద్దులు ధిక్కరించిందా, ఎంత సొమ్ము వచ్చిందనేది పట్టించుకోలేదు.గత మే నెల తర్వాత కాంట్రాక్టు సంస్థ గడువు ముగియడంతో పాత జేపీ సంస్థ బిల్లులతో ఇసుక రవాణా జరిగింది. అక్రమ డ్రెడ్జింగ్ జరిగింది. బ్రిడ్జిల సమీ పంలో ప్రమాదకరంగా పెద్ద గోతులు పెట్టి తవ్వినా, అక్రమ ఇసుక గుట్టలుగా ఉన్నా, పట్టప గలే డ్రెడ్జింగ్ పడవలు కంటికి కనిపించినా సెబ్ అధి కారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రభు త్వం మారడంతో అప్పటి అక్రమాలన్నీ బయటకు వస్తు న్నాయి.ఈ నేపథ్యంలో సెబ్ డిపార్ట్‌మెంట్‌ను ప్రక్షాళన చేసే దిశలో ప్రభుత్వ ఆలోచనలు ఉన్నట్టు సమాచారం.





సీతానగరంలో కాలినడకన వెళుతూ అపారిశుధ్యం పరిశీలిస్తున్న కలెక్టర్ ... పీహెచ్‌సీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఒక్క డయేరియా కేసు పెరిగినా అధికారులపై చర్యలు

సీతానగరంలో అధికారులకు కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

సీతానగరం,జూలై 5 : సీతానగరం మండలంలో మరొక్క డయేరియా కేసు పెరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను హెచ్చరించారు. సీతానగరం గ్రామంలో 11 డయేరియా కేసులు నమోదు కావడంతో శుక్రవారం ఆమె పర్యటించారు. ముందుగా సీతానగరం పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. డయేరియా కేసులు పెరగకుండా ఏం చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. సీతానగరం పీహెచ్‌సీ దుస్థితిని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భార్య బత్తుల వెంకటలక్ష్మి కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు గ్రామంలో పారిశుధ్యం పరిశీలిస్తూ కాలినడకన పంచాయతీ నుంచి పీహెచ్‌సీ సెంటర్‌కు వెళ్లారు. మార్గమధ్యలో నీళ్లు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీని చూసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను పరామర్శించారు. డయేరియా కేసుల నియంత్రణపై అధికారులకు సూచనలు చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతానగరం పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరిందని.. మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బొబ్బిల్లంక వద్ద పీహెచ్‌సీ సెంటర్ మంజూరైందని.. దీనికి నిధులు కేటాయించే ప్రయత్నం చేద్దామన్నారు. స్థానికులు ఎవరైనా రోడ్డుపై చెత్తవేస్తే నోటీసులు ఇచ్చి వారిపై చర్యలు తీసుకోవాలని డీపీవో రాంబాబు పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిత్యం పంచాయతీ పరిశుభ్రం చేస్తున్నా మళ్లీ చెత్త రోడ్డుపక్కనే వేస్తున్నారని పంచాయతీ అధికారులు తెలిపారు. చెత్తబుట్టలు పెట్టుకుని చెత్తను దాంట్లో వేసుకుని పంచాయతీ వాహనం వచ్చినప్పుడు దాంట్లో వేసేలా అలవాటు చేయాలన్నారు. ఆర్‌డీవో చైత్రవర్షిణి, డీఎల్‌డీవో వీణాదేవి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, బత్తుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా యర్నగూడెం-పొంగుటూరు రోడ్డు



యాదవోలు-పొంగుటూరు రోడ్డులో అతిపెద్ద గుంత

దేవరపల్లి, జూలై 5: యర్నగూడెం-పొంగుటూరు రోడ్డు అధ్వానంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో గుంతలు ఇంత కూడా పూడ్చకపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. యాదవోలు వ్యవసాయ మార్కెట్ సమీపంలో రోడ్డు పైన పెద్ద గుంత ఏర్పడటంతో వర్షపునీరు చేరి వాహనచోదకులు నిమ్మకాయలు తీసుకెళ్లే ఆటోల డ్రైవర్లు ఆ గుంతల్లో పడిపోతామనే భయంతో ఉన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి యుద్ధ ప్రతిపాదిక రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

11న మోటారు సైకిళ్ల వేలం

కొవ్వూరు, జూలై 5: కొవ్వూరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో సారా, ఇతర కేసుల్లో పట్టుబడిన 4 మోటారుసైకిళ్లను ఈ నెల 11న కార్యాలయం వద్ద ఉదయం 10గంటలకు వేలం వేస్తున్నట్టు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తమ ఆధార్‌కార్డు జిరాక్స్, ధరావతు సొమ్ము రూ.5000 చెల్లించి పాల్గొనవచ్చునన్నారు. హెచ్చు పాటదారుడు 18శాతం జీఎస్టీని ప్రభుత్వ జీఎస్టీ నెంబరుకు జమచేయాలన్నారు.

సురక్షితమైన తాగునీరందించాలి

డీఎల్‌డీవో శాంతామణి.. వాటర్ ట్యాంకుల తనిఖీ



దేవరపల్లిలో అధికారులకు సూచనలు చేస్తున్న డీఎల్‌డీవో శాంతామణి

దేవరపల్లి/గోపాలపురం జూలై 5: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని డీఎల్‌డీవో వీ.శాంతామణి అధికారులకు సూచించారు. దేవరపల్లి, గోపాలపురం మండలం వేలచింతలగూడెం, పెద్దాపురం, గోపాలపురం గ్రామాల్లో వాటర్ ట్యాంకులను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటి పరిశుభ్రతను పరిశీలించి ట్యాంకుల్లో నీటి నమూనాలను సేకరించారు. ప్రతీ పంచాయతీ పరిధిలో ఉన్న వాటర్‌ట్యాంకులను 15 రోజులకు ఒకసారి పరిశుభ్రంగా కడిగి క్లోరినేషన్ అయిన తాగునీటిని సరఫరా చేయాలన్నారు.ప్రతి రోజు బ్లీచింగ్ కలపాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచడానికి పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సురక్షితమైన నీరు అందించాలని, పైపుల లీకేజీలు, మురుగు, నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు ప్రసాద్, రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి, పంచాయతీ కార్యదర్శులు రవికిషోర్, వెంకాయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్‌ల పంపిణీ



పెరవలి, జూలై 5: మండలంలోని పలు పాఠశాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్‌లను కూటమి నాయకులు శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. పిల్లల చదువు కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అందరూ సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాల్లో సలాది కృష్ణమూర్తి, పిప్పర రవి, రాపాక ప్రమీల, బొడ్డు రామాంజనేయులు, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, నందమూరి నారాయణరావు, సీతారామ్, కరుటూరి సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఉండ్రాజవరం, జూలై 5: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు సెల్యూట్ చేయాలని, జెండా ఆవిష్కరణ సమయంలో మహనీయులైన పూలే, అంబేడ్కర్, బాబూజగ్జీవన్ రామ్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలన్నారు. అమరవీరుల ఫొటోలకు నివాళులర్పించాలని నాయకులు, కార్యకర్తలను మధుబాబు కోరారు.

కాచి చల్లార్చిన నీటిని తాగించాలి



రేగులగుంట అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో సుందరి

గోపాలపురం, జూలై 5: డయేరియా నియంత్రణకు ప్రతిఒక్కరు సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో వైబీటీ సుందరి అన్నారు. మండలంలోని నందిగూడెం, రేగులగుంట గ్రామాల్లో స్టాప్ డయేరియా అవగాహన సదస్సులు నిర్వహించారు. అంగన్వాడీ పాఠశాలల్లో చిన్నారులకు కాచి చల్లార్చిన నీటిని తాగించాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై చిన్నారులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠశాల పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ పద్మావతి, జేవీ రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

పాలంగి, కె.సావరం గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే

ఉండ్రాజవరం, జూలై 5: మండలంలోని పాలంగి, కె.సావరం గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు మలేరియా సబ్‌యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు దోమల ఉధృతి నివారించే చర్యలను ప్రజలకు వివరించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.నాగరాజు, రత్నకుమారి, ఎం.శ్రీనివాస్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బోధనా సామగ్రి అందజేత



తాళ్లపూడి, జూలై 5: మండలంలోని బల్లిపాడులో జేబీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం శ్రీసాయిరాం జ్ఞానమండలి ఆధ్వర్యంలో పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు అందించారని ప్రధానోపాధ్యాయుడు జి.విజయ్‌కుమార్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో జ్ఞానమండలి సభ్యులు వల్లిపల్లి సతీష్, మీఎస్‌వీ రమణ, ఉపాధ్యాయురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఎంపీపీ దుర్గారావు



దేవరపల్లి, జూలై 5: మాజీ సీఎం జగన్‌ను తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కేవీకే దుర్గారావు కలిశారు. ఎన్నికల అనంతరం జరిగిన సంఘటనలపై వైసీపీ కార్యకర్తలకు మనోధైర్యం నింపాలని, అలాగే తాను జనవరిలో రాష్ట్రంలో బస్సు యాత్ర చేపడతానని తెలిపారని కేవీకే తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కొవ్వూరు, జూలై 5: విద్యా సంవత్సరం-2024-25కి సంబంధించి కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. కళాశాలలో బీఏ హిస్టరీ, బి.కామ్ కంప్యూటర్స్, బీఎస్సీ బొటని, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో ఉదయం 10గంటల నుంచి సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 79892 01001, 94941 65717, 0881 3297035 నెంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు.

పెంపుడు జంతువులూ ప్రాణాంతకమే!

- వాటి నుంచి 200 రకాల వ్యాధుల సంక్రమణ
- అవగాహన లేకుంటే ప్రాణాలకే ముప్పు
- టీకాలు వేయించడం తప్పనిసరి
- నేడు ప్రపంచ జునోసిస్ డే



చాగల్లు పశువైద్యశాల వద్ద వ్యాక్సిన్‌లు వేయించడం కోసం నిరీక్షిస్తున్న కుక్కల పెంపకందారులు(ఫైల్)

చాగల్లు, జూలై 5: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పశుపోషణ ఒక భాగం. ఆర్థిక అవసరాలు, సరదా కోసం పశువులు, కోళ్లు, కుక్కలను పెంచుతారు. అయితే జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన లేకపోతే మన ప్రాణాలకే ముప్పు వస్తుంది. కుక్క కాటుకు రేబిస్ వ్యాధి రాకుండా టీకాలను జూలై 6న కనుగొన్నారు. ఆ రోజును ప్రపంచ జోనోసిస్ డేగా జరుపుకుంటారు. పశువులు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునోటిక్ వ్యాధులంటారు. ఈ వ్యాధుల వల్ల మరణాలు కూడా సంభవిస్తాయి. 200 రకాల జునోటిక్ వ్యాధులు వస్తాయి. వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసం తినడం వల్ల తోళ్ల పరిశ్రమలో పనిచేసే వారికి పొలం పనులు చేసుకొనే వారికి, పెంపుడు కుక్కలతో సన్నిహితంగా ఉండేవారికి జోనటిక్ వ్యాధులైన అంత్రాక్స్, క్షయ, రేబిస్, బర్డ్‌ఫ్లూ, మెదడువాపు, సార్స్ టాక్సో ప్లాస్మోడియా, లిస్టోనియా సిస్, టైఫస్, క్యూ ఫీవర్, స్కైబీస్ సంక్రమించే అవకాశం ఉంది. కుక్క కాటు వల్ల వచ్చే ర్యాబిస్ అత్యంత ప్రమాదకరం. మనిషి గాయాలను పిచ్చికుక్క నాకడం, కరవడం వల్ల ర్యాబిస్ వస్తుంది. కుక్క కరచిన వారం నుంచి పది రోజుల్లోపు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసి డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. బర్డ్‌ఫ్లూ కోళ్లు, ఇతర పక్షులకు వస్తుంది. పందులు, దోమలు వల్ల మనుషుల్లో మెదడువాపు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అంత్రాక్స్ వ్యాధి జంతువులకు మనుషులకు సంక్రమిస్తుంది. పశువులు పొట్ట ఉబ్బి అకస్మాత్తుగా చనిపోతాయి. మనుషుల్లోను జ్వరం, నిమోనియా వస్తుంది.

జోనోటిక్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



జోనోటిక్ వ్యాధులు పశువులకు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వీధి, పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేయించి లైసెన్సులు తీసుకోవాలి. పెంపుడు కుక్కలకు అవసరం లేదని నిర్లక్ష్యం చేయవద్దు. పశువులు, కోళ్ల పెంపకందారులు, జంతువులతో సన్నిహితంగా మెలిగే వారు జోనోటిక్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలి.

-యు.ముఖేష్, పశువైద్యాధికారి, చాగల్లు.

నేడు పశువుల ఆసుపత్రిలో ఉచిత టీకాలు

ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా శనివారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద వ్యాధులు సోకకుండా ఉచిత టీకాలు వేస్తున్నట్టు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట సత్యనారాయణ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి మూడు నెలలు వయస్సు దాటిన కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ టీకాలు వేస్తారని, యజమానులు విధిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17,878 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

- సాగు లక్ష్యాలు నూరుశాతం పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- వ్యవసాయ, అనుబంధ ప్రాథమిక రంగాల పురోగతిపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 5: జిల్లాలో 77,817 హెక్టార్లలో సాగు లక్ష్యం కాగా ఇప్పటికి 17,878 ఎకరాల్లో వరి నాట్లు (23శాతం) పూర్తయినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ ప్రాథమిక రంగాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యమిస్తూ, మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఆయా మార్గదర్శకాలు మేరకు కార్యాచరణ సిద్ధం చేసుకుని ముఖ్యమంత్రి నిర్వహించే సమీక్ష సమావేశాలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. వ్యవసాయ రంగానికి చెంది రానున్న ఖరీఫ్ సీజన్ ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ఇప్పటికే సాగునీరు విడుదల చేశామని, ఆయా ప్రాజెక్టుల దిగువన ఉన్న సాగు లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. నాట్లు వేసేందుకు విత్తనాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాయని, రైతు రైతు మధ్య సుమారు 29వేల క్వింటాళ్లు, ప్రైవేటు వ్యక్తుల ద్వారా సుమారు 10 వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మట్టి పరీక్షలకు సంబంధించి 75శాతం లక్ష్యాలకు గాను 84శాతం అదనంగా పురోగతి సాధించినట్టు తెలిపారు. అవసరమైన ఎరువుల లభ్యత ఉందని, ఎరువులు ప్రభుత్వ గోడౌన్‌లలో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ఖర్చులను తగ్గించే అవకాశం ఉందన్నారు. అలాగే మత్స్యరంగం, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానసాగు సాగు విస్తీర్ణం, నీటి వసతులు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏపీఎంఐపీ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా మార్కెటింగ్ ఏడీ ఎం. సునీల్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, హార్టీకల్చర్ అధికారి శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయాధికారి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను పునరుద్ధరణకు కృషి

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్



జవహర్‌ను సత్కరిస్తున్న చర్మకార వృత్తి సంఘం నాయకులు

కొవ్వూరు, జూలై 5: లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంటు కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, లిడ్‌క్యాప్ కార్పొరేషన్ చర్మకార వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు కృషి చేస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ అన్నారు. శుక్రవారం కొవ్వూరులో జవహర్ నివాసంలో ఏపీ చర్మకార వృత్తి సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసిశారు. ఆయనను సత్కరించి లెదర్ చెప్పులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంటు కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలన్నారు. లిడ్‌క్యాప్ కార్పొరేషన్ చర్మకార వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించాలని కోరారు. జవహర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన కార్పొరేషన్ల ద్వారా ఏ కులానికి లబ్ధి చేకూరలేదన్నారు. గతంలో చంద్రబాబు లెదర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి చర్మకార వృత్తి మీద ఆధారపడిన కుటుంబాలను ఆదుకున్నారని, నెల్లూరు, గుత్తిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మాదిగ, మాల, ఇతర కార్పొరేషన్లు ఏర్పాటుచేశారని, కాని ఏ కార్పొరేషన్ ద్వారా ఆయా కులాలకు ఎటువంటి లబ్ధి చేకూరలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ చర్మకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులిమేల నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు కొండూరి కిషోర్‌కుమార్, కొండముది కృష్ణ, పునురి శివ, కొండుల ప్రసాద్, తల్లూరి జయరావు పాల్గొన్నారు.

సజ్జ పంటతో రైతులకు ఆర్థిక ప్రయోజనం

- ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు
- సజ్జ సమగ్ర పంట యాజమాన్య శిక్షణ



సజ్జ పంటపై సాంకేతిక కరపత్రం ఆవిష్కరిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

రాజానగరం/కోరుకొండ, జూలై 5: రైతులు మూడో పంటగా సజ్జను సాగుచేస్తే ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు రైతులకు సూచించారు. కోటికేశవరంలోని రైతు భరోసా కేంద్రం వద్ద సజ్జ సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై శుక్రవారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మూడో పంటగా సజ్జ పంటను సాగు చేస్తే నాణ్యమైన, పోషక విలువలున్న చిరు ధాన్యపు పంటను ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకుని ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు చీడపీడల తాకిడి స్వల్పంగా ఉంటుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త పి.అమ్మాజీ మాట్లాడుతూ తక్కువ నీరు తడులు, ఎరువులతో ఆరోగ్యకరమైన పంటను పొందవచ్చన్నారు. తొలి దశలో కలుపు నివారణ సమతుల్యమైన ఎరువులను వాడుతూ కేవలం 2,3 నీరు తడులతో పంటను తీసుకోవచ్చన్నారు. మరో ప్రధాన శాస్త్రవేత్త ఎస్.హైమ జ్యోతి మాట్లాడుతూ 70-85 రోజుల్లో వేసవి పంటగా పండిస్తే, ఎకరాకు నికరాదాయం రూ.20 వేలు వరకు పొందవచ్చన్నారు. మరో ముఖ్యఅతిథి, వ్యవసాయశాఖ ఏడీఏ మల్లికార్జునరావు మాట్లాడుతూ జిల్లాలో సజ్జ, కొర్ర వంటి పంటల పట్ల రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నామని, ఈ ఏడాది కొంత విస్తీర్ణం చిరుధాన్యాల సాగుకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీఏడీఏ జయరామలక్ష్మి, ఏవో గౌరీదేవి, వీఏఏలు, అభ్యుదయ రైతులు ముండ్రు వీరభద్రరావు, ఇసుకముల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జి.యర్రంపాలెంలో డ్వాక్రా మహిళల ఆందోళన

- ఎమ్మెల్యే బత్తులు సంఘీభావం
- బ్యాంకు అధికారుల హామీతో ఆందోళన విరమణ



బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, ఎమ్మెల్యేకు హామీ పత్రం అందజేస్తున్న బ్యాంకు అధికారులు



దివాన్‌చెరువు, జూలై 5: రాజానగరం మండలం జి.యర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా బిజినెస్ కరస్పాండెంట్ తమను దగా చేశాడని న్యాయం చేయాలంటూ బాధిత మహిళలు శుక్రవారం బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆందోళనకారుల వద్దకు చేరుకుని వారికి మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. బ్యాంకు, డీఆర్‌డీఏ అధికారులతో ఆయన చర్చించారు. అనం తరం మాట్లాడుతూ బ్యాంకులో రెండేళ్లుగా మోసం జరుగుతుందని తాను గమనించానన్నారు. డ్వాక్రా మహిళలు బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌కు సొమ్ము చెల్లించేవారన్నారు. ఆసొమ్ము తీసుకుని బీసీ స్టాంప్ వేసి రిఫరెన్స్ నెం బర్ నమోదు చేసి రశీదు ఇచ్చేవారని, వాటిని డ్వాక్రా మహిళలు నమ్మి భద్ర పర్చుకున్నారన్నారు. పాసుబుక్ ఎంట్రీలు వేసి ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా బ్యాంకు సిబ్బంది ఏవో సాకులు చెప్పి కాలయాపన చేశారన్నారు. బీసీకి సొమ్ము చెల్లించిన విషయం బ్యాంకు సిబ్బందికి, యానిమేటర్‌కు కూడా తెలు సని చెప్పారు. జి.యర్రంపాలెంతో పాటు కొండగుంటూరు, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలు, అలాగే బంగారు పంట రుణాలకు సంబంధించి రూ.57,70,950 దుర్వినియోగం చేసినట్టు ఇంతవరకు పరిశీలనలో తేలిందన్నారు. ఇంకా జి.యర్రంపాలెంలోని 17 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన లావాదేవీలను పరిశీలిస్తున్నారన్నారు. అనధికారికంగా రూ.70 నుంచి 80లక్షలు వరకు స్కామ్ జరిగినట్టు తెలుస్తోందన్నారు. తమ ఆందోళనతో దిగివచ్చిన బ్యాంకు ఉన్నతాధికారులు 45 రోజుల్లో బాధితులకు సొమ్ము చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో తోరాటి శ్రీను, మద్దిరెడ్డి చినవెంకటేశ్వరరావు, బా బులు, పేపకాయల విస్ణుమూర్తి, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, డీపీడీ జనార్దన్, ఏపీఎం హేమ, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ పి.కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి

బిక్కవోలు, జూలై 5: శిశువులు, తల్లుల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగపు అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొంకుదురులో శుక్రవారం ఆయన మండలాధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డితో కలసి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్తి తాతారెడ్డి, అంగన్వాడీ సిబ్బంది పైలి వెంకటలక్ష్మి, నేకూరి సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

కడియం, జూలై 5: మండలంలోని దుళ్లలో నెంబర్-1, నెంబర్-2 పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన కంటిపూడి కిరణ్‌కుమార్ శుక్రవారం నోట్‌బుక్స్ సమకూర్చారు. వీటిని కిరణ్‌కుమార్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు కంటిపూడి బాలకృష్ణ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు, తోకల శ్రీనివాసరావు, హెచ్ఎం గెడ్డం ఆనంద్, శశికుమారి, గంపల పాపారావు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 5: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డితో కలిసి స్వామికి పూజలు చేశారు. శ్రీవారి ఆశీస్సులతో కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే స్వామి దర్శనానికి వచ్చిన చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య దంపతులను నల్లమిల్లి దంపతులు ఆలయ ప్రాంగణంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నల్లమిల్లి వెంట వెంకటకృష్ణారెడ్డి దంపతులు, గొలుగూరి వీర్రాఘవరెడ్డి, సాగర్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాన్ని నెరవేర్చాలి

అనపర్తి, జూలై 5: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సర్పంచ్ గిరిడా గంగాభవాని అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తేనెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత

దివాన్‌చెరువు, జూలై 5: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 అధికారి ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. వన మహోత్సవం సందర్భంగా తమ దత్తత గ్రామమైన దివాన్‌చెరువులోని ఎంపీపీ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై కత్తితో దాడి

నిందితుడికి రిమాండ్



గాయపర్చిన వ్యక్తి సూరిబాబు

గోకవరం, జూలై 5: మతిస్థిమితం లేని మహిళపై ఓవ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... దేవీపట్నం మండలం సీతారం గ్రామానికి చెందిన ఈక సుబ్బలక్ష్మి బీఈడీ వరకు చదువుకుంది. సుమారు ఐదేళ్ల క్రితం తల్లిదండ్రులు మృతి చెందడంతో అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి బాగోలేదు. శుక్రవారం తెల్లవారుఝామున గోకవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా గోకవరానికి చెందిన ఎడ్ల సూరిబాబు వెళ్లి మద్యం తాగేందుకు డబ్బులు గానీ, బంగారం గానీ ఇవ్వాలని కత్తితో బెదిరించాడు. దీంతో సుబ్బలక్ష్మి అతని నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా చేతిలో ఉన్న చాకుతో కుడి చెయ్యి, కుడి బుగ్గపై గాయపర్చాడు. ఈ ఘటనపై బాధితురాలి సోదరుడు ఈక రాంబాబు ఫిర్యాదు మేరకు సూరిబాబుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా నిందితుడికి 15 రోజులు రిమాండు విధించినట్టు ఎస్ఐ కూన నాగరాజు తెలిపారు.

కోరుకొండలో కోటి శివలింగాల తయారీ

కోరుకొండ, జూలై 5: కోరుకొండ హరేరామ సమాజం ఆవరణలో కోటి శివలింగాల తయారీ కార్యక్రమం కొనసాగుతోంది. పలువురు మహిలు పాల్గొని బంకమట్టితో కోటి శివలింగాలు తయారు చేస్తున్నారు. వీటిని వారణాసి తరలిస్తారని ప్రత్యేక పూజలు చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కోటి శివలింగాలు తయారీ కార్యక్రమం వారం రోజులపాటు జరుగుతుందని బదిరెడ్డిదొర, బదిరెడ్డి తులసి, కర్రి వీరగణేష్, కటకం చలం పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం, జూన్ 5: మండలంలోని తాడిపర్రు, ఉండ్రాజవరం అగ్రికల్చర్ పరిధిలో ఈనెల 6న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వి ద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. వార్షిక మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

చాగల్లు చేరుకున్న సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తూ చాగల్లు విచ్చేసిన వ్యక్తికి సంఘీభావం తెలుపుతున్న స్థానిక టీడీపీ నాయకులు

చాగల్లు, జూలై 5: విజయవాడ పడమటకు చెందిన నంది సత్యనారాయణ కూటమి విజయం సాధించి సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించాలని మొక్కుకున్నాడు. అతని కోరిక నెరవేరడంతో విజయవాడలో శ్రీకనక దుర్గమ్మను దర్శించుకుని అక్కడి నుంచి సైకిల్ యాత్ర చేస్తూ శుక్రవారం చాగల్లు విచ్చేసాడు. ఈ సందర్భంగా అతనికి స్థానిక కూటమి నాయకులు సంఘీభావం తెలిపి స్వాగతం పలికారు. అభినందనలు తెలిపారు. ఈ సైకిల్ యాత్ర శ్రీకాకుళం జిల్లా అరకు వ్యాలీ వరకు వెళ్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకోవడంతో యాత్ర ముగుస్తుందని ఆయన తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి సతీస్ తదితరులు సంఘీభావం తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	మనమే
వై.స్ర్కీన్ 2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	కల్కి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	గంగం గణేశా
స్ర్కీన్ 2	---
శ్రీనివాస	---